సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
సోమవారం, 21.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 321
పేజీలు: 08 వెల: రూ. 5

## టెక్ ప్రపంచంలో సంచలనం
ఓపెన్ ఏఐని హ్యాక్ చేసిన ముగ్గురు భారతీయులు

- క్లాడ్ సాయంతో ఓపెన్ ఏఐ సిస్టమ్‌లో లోపాల గుర్తింపు
- ముగ్గురు భారతీయ పరిశోధకుల 72 గంటల ప్రయోగం
- కోడెక్స్, గిట్ హబ్ వాతావరణం వరకు పరిశోధకుల యాక్సెస్
- సైబర్ సెక్యూరిటీలో ఏఐ వినియోగంపై కొత్త చర్చ


02

## మోదీ కేబినెట్
బీజేపీ అంతర్గత సర్వేతో కలకలం

# ప్రక్షాళనకు బ్రేక్?
జెన్‌జీ నిరసనల తర్వాత మారిన సమీకరణాలు..

- ఎంపీల పనితీరుపై బీజేపీ ఆరా
- యువతలో అసంతృప్తిపై పార్టీ ఫోకస్
- మోదీ బ్రాండ్‌పై ఆధారపడటంపై సమీక్ష
- కేబినెట్ మార్పులకు మరింత ఆలస్యం?
- కొత్త పరిశీలన బృందంతో కసరత్తు
- మంత్రుల పనితీరుపై అధిష్ఠానం దృష్టి
- ప్రక్షాళనకు ముందు కీలక నిర్ణయాలు?




**ముద్ర, న్యూఢిల్లీ:** కేంద్ర మంత్రివర్గ ప్రక్షాళనపై కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు ఇప్పట్లో తెరపడే అవకాశాలు కనిపించడం లేదు. మంత్రుల పనితీరు, ప్రభుత్వ పనితీరు, యువతతో బీజేపీ అనుసంధానం వంటి అంశాలపై పార్టీ, ప్రభుత్వం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే బీజేపీ అంతర్గత సర్వే కారణంగానే కేబినెట్ ప్రక్షాళన వాయిదా పడిందన్న ప్రచారానికి ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు.

**జెన్‌జీ నిరసనల ప్రభావం**

2026 జూలైలో విద్యా వ్యవస్థ, పరీక్షా పేపర్ లీకేజీల అంశాలపై జెన్‌జీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలు జాతీయ స్థాయిలో చర్చకు దారితీశాయి. ఈ ఆందోళనల నేపథ్యంలో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. రాష్ట్రపతి భవన్ జూలై 25న ఆయన రాజీనామాను ఆమోదించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామం తర్వాత యువతతో బీజేపీ సంబంధాలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్, ప్రభుత్వంపై యువత అభిప్రాయం వంటి అంశాలు పార్టీ దృష్టిలో మరింత ప్రాధాన్యం సంతరించుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

**ఎంపీల పనితీరుపైనా సమీక్ష?**

కేబినెట్ మార్పులపై చర్చ జరుగుతున్న సమయంలో మంత్రుల పనితీరును ప్రధాని మోదీ సమీక్షించినట్లు, మంత్రులకు సోషల్ మీడియా ఔట్‌రీచ్‌పై కూడా అంచనాలు ఇచ్చినట్లు తాజా కథనాలు పేర్కొంటున్నాయి. బీజేపీ కొత్త నాయకత్వం యువతను చేరుకునే వ్యూహంపైనా సమావేశాలు నిర్వహిస్తోంది. అయితే ఎంపీలపై మిగతా 02లో



ఖైరతాబాద్ బరిలో దింపనున్న హస్తం

## దానం ప్లేసులో
# రోహిన్ రెడ్డి
రేవంత్ సన్నిహితుడి వైపునకే మొగ్గు

- ఉప ఎన్నికపై కాంగ్రెస్‌లో కీలక చర్చ
- దానంకు ఎమ్మెల్సీ.. రోహిన్‌కు టికెట్?
- ఖైరతాబాద్‌పై రేవంత్ వ్యూహం ఇదేనా?
- కాంగ్రెస్ అభ్యర్థిగా రోహిన్ రెడ్డి పేరు తెరపైకి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో మరో ఉప ఎన్నికకు రంగం సిద్ధం అయినట్లే. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణం నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక రాగా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, ఆ పార్టీ నుండి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసిన నేపథ్యంలో హైకోర్టు దానిని పరిగణనలోకి తీసుకుని అనర్హత వేటు వేసింది. దీంతో ప్రస్తుతం ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి జరగబోయే ఉప ఎన్నికలో కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుంది అన్నది చర్చానీయాంశంగా మారింది. 2004 శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ దక్కకపోవడంతో టీడీపీలో చేరిన దానం నాగేందర్ ఆసిఫ్ నగర్ నియోజకవర్గం నుండి విజయం సాధించాడు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, వైఎస్ ముఖ్యమంత్రి కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి, కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఉప ఎన్నికల్లో ఓడిపోయాడు

అనర్హత వేటు పడిన నేపథ్యంలో ఖైరతాబాద్ నుండి దానం నాగేందర్ కు కాంగ్రెస్ టికెట్ ఇస్తే గెలుస్తాడా ? అన్న చర్చ బయలుదేరింది. అందుకే ఆయన స్థానంలో కొత్తవారికి టికెట్ ఇచ్చి, దానంను పక్కన పెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. 1994, 1999, 2004, 2009, 2018, 2023లలో దానం అసిఫ్ నగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల నుండి గెలుస్తూ వస్తున్నాడు. అయితే పార్టీ మారిన నేపథ్యం మూలంగా ప్రజల నుండి ఆదరణ ఉండకపోవచ్చని ఆయన స్థానంలో మరొకరికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తుంది.

గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ తరపున పీజేఆర్ కూతురు విజయారెడ్డి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. అప్పుడు ఈ స్థానం నుండి పోటీ చేయాలని రేవంత్ సన్నిహితుడు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ఆశించినా అవకాశం రాలేదు. దాంతో అంబర్ పేట నుండి మిగతా 02లో

ఖైరతాబాద్ ఉప ఎన్నికలో
## కాంగ్రెస్ నిమజ్జనం
కేంద్రమంత్రి బండి సంజయ్ 03

- ఉప ఎన్నికను ఎదుర్కోలేక సుప్రీం కోర్టుకు
- దానం పని ఖతమైనట్టే
- కేసీఆర్ ఫాంహౌజ్ టూరిజం కేంద్రమా..
- ఫాంహౌజ్ సందర్శన పెద్ద జోక్
- ప్రైవేట్ భూములను సందర్శనకు మీకు అధికారం ఎక్కడిది.?
- 22ఏ సమస్య పరిష్కరించకపోతే న్యాయపోరాటం

ముద్ర, కరీంనగర్ :



వెయ్యి డ్రోన్లతో రష్యాపై
## ఉక్రెయిన్ దాడి
మాస్కోపై విరుచుకుపడిన ఉక్రెయిన్



- మాస్కో ఆయిల్ రిఫైనరీ సమీపంలో భారీగా మంటలు
- 450కుపైగా డ్రోన్లను కూల్చివేశామన్న రష్యా
- డ్రోన్ దాడులతో మాస్కోలో విమాన సర్వీసులకు అంతరాయం
- యుద్ధం ముగించి శాంతిని ఎంచుకోవాలని జెలెన్‌స్కీ పిలుపు

ముద్ర, న్యూ ఢిల్లీ:

02

## జూరాల వద్ద
# ఉద్రిక్తత
నీటి కోసం రైతుల ఆందోళన

ఎడమ కాలువ గేట్లు ఎత్తిన రైతులు..
తిరిగి మూసివేత

- పోలీసుల పహారాలో ప్రాజెక్ట్
- ఎండిపోతున్న పంటలు..
- తక్షణ నీటి విడుదలకు డిమాండ్
- రైతుల ధర్నాతో ప్రాజెక్టు వద్ద భారీ బందోబస్తు
- నీళ్లు ఏపీకి వెళ్తున్నాయంటూ కేటీఆర్ ఫైర్..

**ముద్ర, వనపర్తి :** వనపర్తి జిల్లాలోని జూరాల ప్రాజెక్టు వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాలువ కింద సాగు చేసిన పంటలు తీవ్రంగా ఎండిపోతుండటంతో.. నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయకట్టు రైతులు ఆందోళన బాట పట్టారు. పరిస్థితి చేయిదాటిపోకుండా ముందస్తు జాగ్రత్తగా అధికారులు ప్రాజెక్టు ప్రాంగణంలో భారీగా పోలీసులను మోహరించారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు మొత్తం పోలీసుల కట్టుదిట్టమైన పహారాలోకి వెళ్లిపోయింది.

**అసలేం జరిగింది?**

ఎగువ నుంచి తగినంత నీటి ప్రవాహం లేక, తీవ్ర నిరీక్షణ మధ్య పంటలు ఎండిపోతుండటంతో ఆవేదన చెందిన ఆయకట్టు రైతులు శనివారం రోజు స్వయంగా ముందుకు వచ్చి జూరాల ఎడమ కాలువ గేట్లను ఎత్తారు. కాలువలోకి నీటిని విడుదల చేసుకుని తమ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయితే.. పరిస్థితులను గమనించిన నీటిపారుదల శాఖ అధికారులు అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ఎడ మ కాలువ గేట్లను తిరిగి బంద్ చేశారు. కాలువకు నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు.



**రైతుల ఆగ్రహం.. భారీ ధర్నా**

ఉదయాన్నే కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోవడాన్ని గమనించిన రైతులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. అధికారులు నీటి విడుదల నిలిపివేయడంతో ప్రాజెక్టు వద్దకు భారీగా చేరుకున్న రైతులు ధర్నాకు దిగారు. మిగతా 02లో

నిరుద్యోగ యువతకు
## తీపికబురు
యువత కలలకు ఉడాన్ రెక్కలు..

- మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కుదిరిన ఎంవోయూ
- రాష్ట్రవ్యాప్తంగా 25 కేంద్రాల్లో 5,500 మంది విద్యార్థులకు శిక్షణ
- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో 3 నెలల కోర్సులు

02

ముద్ర, హైదరాబాద్ :



## రాష్ట్రంలో రాక్షస పాలన
సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :

- కేసీఆర్ ఉన్నప్పుడే అన్ని వర్గాలు బాగుండేవి
- మళ్లీ బీఆర్ఎస్ రాబోతోందనడానికి సంకేతమే చేరికలు

02





ఇదీ AI
ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 21.09.2026
www.mudranews.in | @mudranews



## రాత్రి కాఫీ, టీకి దూరంగా ఉండండి




కాఫీ, టీ వంటి కెఫిన్ పానీయాలు మూత్రవిసర్జనను పెంచవచ్చు. ముఖ్యంగా సాయంత్రం తర్వాత వీటిని తగ్గించడం రాత్రిపూట ఇబ్బందిని నియంత్రించడంలో సహాయపడుతుంది.

### వెయ్యి డ్రోన్లతో రష్యాపై
# ఉక్రెయిన్ దాడి



**ముద్ర, న్యూ ఢిల్లీ:**
రష్యా–ఉక్రెయిన్ మధ్య దాడులు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి ఉక్రెయిన్ దళాలు రష్యాపై ఏకంగా వెయ్యికి పైగా డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. మాస్కోలోని పలు ప్రదేశాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. మాస్కో ఆయిల్ రిఫైనరీకి సమీపంలోనూ ఈ దాడులు జరగడంతో అక్కడ పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. భారీగా పొగ వ్యాపించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశ రాజధానిపై ఈ స్థాయిలో దాడులు చేపట్ట డం ఇదే మొదటిసారని మాస్కో మేయర్ అభివర్ణించారు. మరో 450 ఉక్రెయిన్ డ్రోన్లను తమ దళాలు కూల్చివేశాయన్నారు.
పలు డ్రోన్లు మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీలు సహా నాలుగు భవనాలను తాకినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. వీటి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దు కాగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. రష్యాలో త్వరలో పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉక్రెయిన్ మాస్కోపై దాడులు తీవ్రం చేయడం గమనార్హం.
ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. 'గత రాత్రి మాస్కోలోని అనేక ప్రాంతాలను మా దళాలు లక్ష్యం చేసుకున్నాయి. రష్యాకు చెందిన ఓ కీలక చమురు కర్మాగారం ధ్వంసమైంది. ఇందుకుగానూ మా భద్రతా దళాలు, గూఢచార విభాగం, ప్రత్యేక దళాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇకనైనా మాస్కో యుద్ధాన్ని ముగించి.. శాంతిని ఎంచుకోవాలని కోరుకుంటున్నా' అని జెలెన్స్కీ పేర్కొన్నారు.

### టెక్ ప్రపంచంలో
# పెను సంచలనం

**ముద్ర హైదరాబాద్ :**
టెక్ ప్రపంచంలో ఏఐపై ఆధిపత్యం పెరుగుతున్న వేళ, భారతీయ సైబర్ సెక్యూరిటీ పరిశోధకులు చేసిన ఓ ప్రయోగం ఆసక్తికరంగా మారింది. హ్యాక్ ట్రాన్ ఏఐకి చెందిన హర్ష్ జైస్వాల్, మోహన్ పెదపాటి, రాహుల్ మైని.. ఆంత్రోపిక్‌కు చెందిన క్లాడ్ ఏఐ సాయంతో ఓపెన్ ఏఐ సిస్టమ్‌లోని భద్రతా లోపాలను గుర్తించి పరీక్షించారు.
ఓపెన్ ఏఐ బగ్ బౌంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పరిశోధనలో, కంపెనీ కమ్యూనిటీ ఫోరమ్‌లో ఇమేజ్ ఫైళ్లను ప్రాసెస్ చేసే విధానంలో ఉన్న లోపాన్ని పరిశోధకులు గుర్తించారు. అనంతరం ఆ లోపాన్ని విశ్లేషించడానికి, కోడ్‌ను డీబగ్ చేయడానికి, ఎక్స్‌ప్లాయిట్‌ను అభివృద్ధి చేయడానికి క్లాడ్ ను ఉపయోగించారు.
ఈ ప్రక్రియలో మరిన్ని భద్రతా బలహీనతలను గుర్తించి, ఓపెన్ ఏఐ ఉద్యోగి కోడెక్స్ ఖాతా ద్వారా ప్రైవేట్ గిట్ హబ్ వాతావరణానికి యాక్సెస్‌ను ప్రదర్శించినట్లు నివేదికలు చెబుతున్నాయి. మొదటి లోపాన్ని గుర్తించినప్పటి నుంచి ఈ పరీక్షను పూర్తి చేయడానికి 72 గంటల్లోపే పట్టింది.
ఈ పరిశోధనకు ఓపెన్ ఏఐ నుంచి హ్యాక్ ట్రాన్ ఏఐ బృందానికి బగ్ బౌంటీగా 6,500 డాలర్లు లభించినట్లు సమాచారం. ఈ ఘటనతో AIని సైబర్ సెక్యూరిటీ పరిశోధనలో ఉపయోగించడంపై మరోసారి చర్చ మొదలైంది. అదే సమయంలో ఏఐ ఆధారిత సాధనాలతో పెరుగుతున్న సైబర్ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు మరింత పటిష్టమైన భద్రతా వ్యవస్థల అవసరం కూడా స్పష్టమవుతోంది.

# దానం ప్లేసులో రోహిన్ రెడ్డి





**(మొదటి పేజీ తరువాయి)**
పోటీ చేసి ఓడిపోయాడు. దీంతో ఈ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి దానంను తప్పించి తన సన్నిహితుడు రోహిన్ రెడ్డికి అవకాశం ఇస్తారని అంటున్నారు. దీనికి బదులుగా దానం నాగేందర్ కు త్వరలో ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ స్థానాలలో అవకాశం కల్పించి, మంత్రి పదవి కట్టబెడతారని, ఆ తర్వాత ఖైరతాబాద్ ఎన్నికల్లో గెలుపు బాధ్యతలు దానంకే అప్పగిస్తారని అంటున్నారు.
హైదరాబాద్ నారాయణ గూడ ప్రాంతానికి చెందిన రోహిన్ రెడ్డి 23 ఏళ్లుగా ఎన్ఎస్ యూఐ నుండి ఆయన ప్రస్తానం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నది. అయితే 30 ఏళ్లుగా సీఎం రేవంత్ రెడ్డితో అనుబంధం ఉంది. రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితులలో ఒకరిగా రేవంత్ రెడ్డికి పేరుంది. దేశంలో, విదేశాల్లో రేవంత్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా ఆయన వెన్నంటే ఉంటారు. 'తాను ఇప్పుడూ, ఎప్పుడూ రేవంత్ అన్నతోనే ఉంటాను' అని రోహిన్ రెడ్డి తరచూ చెబుతుంటారు. ఆ అనుబంధం నేపథ్యంలోనే రోహిన్ రెడ్డికి ఈసారి అవకాశం కల్పించడం ఖాయం అని అంటున్నారు.

# రాష్ట్రంలో రాక్షస పాలన

### సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
రాష్ట్రంలో రైతు పాలన పోయి రాక్షస పాలన వచ్చిందని అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అంటున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో భారీగా చేరికల సందర్భంగా ఆయన ముఖ్యఅతిథి గా పాల్గొన్నారు. హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 10 ఏళ్ళు రైతు పాలన సాగిందని నేడు రాక్షస పాలన వచ్చిందన్నారు. ఆనాడు కెసిఆర్ 24 గంటలు కరెంటు ఇచ్చాడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 6 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నాడని ఆ విధంగా వ్యక్తం చేశారు. కరెంటు సరిగా లేక రైతులు పంటలు పండించలేక దిక్కులేని స్థితిలో పడిపోయారని అన్నారు. కరోనా వచ్చిన కేసీఆర్ రైతులకు రైతుబంధు ఆపలేదన్నారు. రేవంత్ రెడ్డి మూడు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టి ఒక పంటకు రెండు ఎకరాలకు ఉంకో పంట కు ఒక ఎకరానికి మాత్రమే రైతుబంధు ఇచ్చాడని ఎద్దేవా చేశారు. రుణమాఫీ సగానికి సగం కాలేదన్నారు. ఆగస్టు 15న రుణమాఫీ చేస్తానని శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టు వేసి స్వామిని మోసం చేసిన ఘనుడు రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం వచ్చి మూడు ఆగస్టులు పోయిన నేటి వరకు రుణమాఫీ కాలేదన్నారు. కేసీఆర్ పాలనలో రైతు మరణిస్తే వారం రోజుల లోపు రైతుబీమాతో 5 లక్షలు రైతు కుటుంబానికి ఇచ్చేవారమని గుర్తు చేశారు. రేవంత్ సర్కార్ రైతు భీమా పథకాన్ని రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్ రావుకు టిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు.
ఆంధ్రకు నీళ్లు తెలంగాణకు కన్నీళ్లు
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆంధ్రకు నీళ్లు తెలంగాణకు కన్నీళ్లే మిగిలాయని అన్నారు. ఆంధ్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులను చర్నీలు దోపిడీ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నోరు మెదపడం లేదన్నారు. ఇప్పుడు వచ్చిన కరువు కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కరువు అని అన్నారు. విద్యుత్ ఉత్పత్తి కి అవకాశం ఉన్న రేవంత్ రెడ్డి ఉత్పత్తి చేయడం లేదని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ లో చేరిన నాయకులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, చిరుమర్తి లింగయ్య, జిల్లా పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయకులు తుంగ బాలు, క్యామ మల్లేష్, గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జూరాల వద్ద తీవ్ర ఉద్రిక్తత




**(మొదటి పేజీ తరువాయి)**
'నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో కళ్లముందే ఎండిపోతున్నాయి. తక్షణమే ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి మా పంటలను, మమ్మల్ని ఆదుకోవాలి' అని రైతులు కన్నీటిపర్యంతమవుతూ నినాదాలు చేశారు.

**ప్రాజెక్టు వద్ద గట్టి పోలీసు భద్రత**
రైతుల నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ప్రాజెక్టు వద్ద భారీగా పోలీసు బలగాలను దించారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. ఎడమ కాలువ గేట్ల వద్దకు ఎవరూ రాకుండా బలగాలు కాపలా కాస్తున్నాయి. అధికారులు మాత్రం నీటి లభ్యత, సాంకేతిక అంశాలను బట్టే కాలువలకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. పంటలు ఎండిపోతున్న తరుణంలో నీరు అందకపోతే తమకు భారీ నష్టం తప్పదని ఆయకట్టు రైతులు ఆందోళన తెలిపారు.

**ఏపీకి ఎలా వెళ్తున్నాయి..? కేటీఆర్**
జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లాలో మీడియాతో మాట్లాడిన ఆయన.. జూరాలకు ఎగువ నుండి నీళ్లు లేవని.. కాలువకు నీటి విడుదల ఆపామని అధికారులు చెప్తున్నారని.. కానీ ఏపీకి నీళ్ళు పోతున్నాయన్నారు. 'కర్ణాటక, ఏపీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాయి. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రం ప్రణాళికతో లేదు. ఆల్మట్టి ఎత్తు పెంచే యోచనలో కర్ణాటక రాష్ట్రం ఉంది. దీంతో పాలమూరుకు భవిష్యత్తులో నీళ్ళు రావు. ఈ విషయం మీద పక్కనే ఉన్న కర్ణాటకను ఎందుకు నిలదీయట్లేదు కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కేవరకు ఊరుకోం" అని హెచ్చరించారు.

# నిరుద్యోగ యువతకు తీపికబురు

**ముద్ర, హైదరాబాద్ :**
యువతను భవిష్యత్ సాంకేతిక రంగానికి అనుగుణంగా తీర్చిదిద్ది, వారికి ఉపాధి–ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. పరిశ్రమల అవసరాలకు తగ్గ నైపుణ్యాలను విద్యార్థులకు అందించి, నేరుగా కొలువులతో అనుసంధానించేందుకు ప్రతిష్టాత్మక 'ఉడాన్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, ప్రముఖ ఐటీ దిగ్గజం డెల్ టెక్నాలజీస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.
సెక్రటేరియెట్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఎంవోయూను టాస్క్, డెల్ సంస్థలు మార్చుకున్నాయి. ఉడాన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఏర్పాటు చేసే 25 ప్రత్యేక శిక్షణా కేంద్రాల ద్వారా తొలి విడతలో 5,500 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.
3 నెలల పాటు సాగే ఈ స్ట్రక్చర్డ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ స్కిల్స్ వంటి భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే ఎమర్జింగ్ టెక్నాలజీలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కేవలం నగరాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి వారిలో పరిశ్రమలకు అవసరమైన ఉపాధి నైపుణ్యాలు పెంపొందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.

**ఐఐటీ ఢిల్లీ సిలబస్..**
**డెల్ సాంకేతిక సాయం**
ఈ ప్రోగ్రామ్ కోసం సిలబస్‌ను ఐఐటీ ఢిల్లీ రూపొందించగా, శిక్షణకు కావాల్సిన పూర్తి సాంకేతిక సహకారాన్ని డెల్ టెక్నాలజీస్ సమకూరుస్తోంది. జాతీయ స్థాయిలో డెల్ టెక్నాలజీస్, ఎఫ్ఐటీటీ–ఐఐటీ ఢిల్లీ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, జనరేషన్ ఇండియా ఫౌండేషన్లు సంయుక్తంగా ఈ ఉడాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాయి. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ డిమాండ్లకు అనుగుణంగా స్థానిక యువతకు అత్యుత్తమ శిక్షణ అందేలా వ్యవస్థను రూపకల్పన చేశారు.
ఎంతమందికి సర్టిఫికెట్లు ఇచ్చామనే గణాంకాలకే పరిమితం కాకుండా, శిక్షణ పొందిన యువతలో ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి? వారికి ఎలాంటి ఉపాధి దక్కింది? అనే కొలమానాల ఆధారంగా టాస్క్ పని చేస్తుందని అధికారులు తెలిపారు. ఒక బలమైన 'ట్రైనింగ్–టు–ఎంప్లాయ్‌మెంట్' ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే లక్ష్యంగా టాస్క్ అడుగులు వేస్తోందన్నారు.

**చదువుతో పాటే కొలువుల బాట**
సాధారణంగా డిగ్రీ లేదా ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం కోర్సులు చేయడం, నైపుణ్యాలు నేర్చుకోవడం పరిపాటిగా మారింది. కానీ ఈ పాత పద్ధతికి స్వస్తి పలికి విద్యార్థి దశలోనే ఇండస్ట్రీకి సిద్ధం చేయాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉడాన్‌ను తీసుకొచ్చింది. ఉద్యోగం / అప్రెంటిస్‌షిప్ / ఎంట్రప్రెన్యూర్ షిప్ అనే చైన్ ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దనుంది. సాంకేతిక నైపుణ్యాలతో పాటు ప్రాక్టికల్ అనుభవం, జాబ్–రెడీనెస్‌పై విద్యార్థులకు గైడెన్స్ ఇచ్చి ఉద్యోగాలు సాధించేలా లేదా సొంతంగా స్టార్టప్‌లు, వ్యాపారాలు ప్రారంభించేలా ప్రోత్సహిస్తారు.



### మోదీ కేబినెట్
# ప్రక్షాళనకు బ్రేక్?



**(మొదటి పేజీ తరువాయి)**
నిర్వహించినట్లు చెబుతున్న అంతర్గత సర్వేలో భారీ స్థాయిలో ప్రజా వ్యతిరేకత బయటపడిందన్న ప్రచారానికి స్వతంత్ర ధ్రువీకరణ లేదు. ముఖ్యంగా ప్రస్తుత ఎంపీల విజయాలు ప్రధానంగా ప్రధాని మోదీ వ్యక్తిగత ప్రజాదరణపైనే ఆధారపడి ఉన్నాయని సర్వే తేల్చిందన్న వాదన కూడా అధికారికంగా నిర్ధారణ కాలేదు.

**ప్రక్షాళనపై పునరాలోచన?**
కేబినెట్ ప్రక్షాళనపై అనేక నెలలుగా ఊహాగానాలు కొనసాగుతున్నప్పటికీ, ఖచ్చితమైన తేదీపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్త ముఖాలకు అవకాశం, మహిళలకు ప్రాతినిధ్యం, కొన్ని మంత్రుల వద్ద ఉన్న అదనపు శాఖల పునర్విభజన వంటి అంశాలపై చర్చ జరుగుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇదే సమయంలో సెప్టెంబర్ 23, 24 తేదీల్లో కేంద్ర మంత్రుల రెండు రోజుల 'చింతన్ శిబిర్' కూడా జరగనుంది. పాలన, ప్రభుత్వ పనితీరు, కమ్యూనికేషన్, వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై ఇందులో చర్చించనున్నట్లు సమాచారం. కేబినెట్ ప్రక్షాళనపై తుది నిర్ణయం ఎప్పుడు? అనేది ఇప్పుడు ఢిల్లీలో ప్రధాన చర్చగా మారింది. యువతతో సంబంధాలు, మంత్రుల పనితీరు, పార్టీ–ప్రభుత్వ సమన్వయం వంటి అంశాలపై జరుగుతున్న సమీక్షల తర్వాతే మోదీ ప్రభుత్వం తదుపరి అడుగు వేస్తుందా? లేక ముందుగా అనుకున్న ప్రక్షాళనను కొనసాగిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

# శ్రీవారిని దర్శించుకున్న భట్టి



**తిరుమల, ముద్ర:** తిరుమల తిరుపతి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఆదివారం రాత్రి జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.




ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో అన్ని రాష్ట్రాల పార్టీ విభాగాల కోఆర్డినేటర్లు, కో–కోఆర్డినేటర్లతో జాతీయ స్థాయి ఒకరోజు కార్యశాల నిర్వహించారు. పార్టీ విభాగాల సంస్థాగత కార్యకలాపాలు, బాధ్యతలు, సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి సంతోష్ జీ మార్గదర్శకత్వం పార్టీ విభాగాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని బీజేపీ జాతీయ పార్టీ విభాగాల సహ సమన్వయకర్త విష్ణు వర్ధన్ రెడ్డి తెలిపారు. -ముద్ర, న్యూఢిల్లీ

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 21.09.2026
www.mudranews.in | @mudranews



**రాత్రి మూత్రవిసర్జన తగ్గేందుకు రాత్రి భోజనంలో ఉప్పు తగ్గించండి**

అధికంగా ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో ద్రవాలు నిల్వ ఉండే అవకాశం ఉంది. రాత్రి భోజనంలో ఉప్పును తగ్గించడం వల్ల రాత్రి మూత్రవిసర్జన కొంత తగ్గవచ్చు.



# మరువలేని మహానటుడు అక్కినేని

**అక్కినేని నాగేశ్వరరావు 103వ పుట్టినరోజు సందర్భంగా**



తరతరాలు ప్రేమించిన కళాకారుడు.కాలం దాటినా నిలిచిపోయిన కీర్తి.అక్కినేని నాగేశ్వరరావు గారి జయంతి సందర్భంగా గౌరవాభివందనం. ఎన్నో హృదయాల ను దోచుకున్న నటుడుగా లక్షలాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న నటుడుగా ఎప్పటికీ మర్చిపోలేని, మరుపురాని మీరు ఎక్కడున్నా మా హృదయాల్లో స్థిర స్థాయిగా ఉంటారని భగవంతుని కోరుకుంటూ,మళ్లీ నటుడుగా పుట్టాలని కోరుకుంటూ మహానటుడు నట సామ్రాట్ ,పద్మశ్రీ,పద్మభూషణ్, పద్మ విభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు మా హృదయాల్లో నిలిచిన వ్యక్తిగా మిమ్మల్ని ఎప్పటికీ మర్చిపోలేం!! మీరు నటించిన చిత్రాలను మీరు సృష్టించిన ఎన్నో పాత్రలను మరవగలమా ఈ తరం కాదు మరొక తరం వరకు మీరు నటించిన చిత్రాలు మాకు జ్ఞాపకంగా ఉంటుందని భావిస్తున్నాం! మళ్ళీ నటుడుగా పుట్టాలనేది ఎంతోమంది కోరుకుంటున్నారు గొప్ప నటుడుగా మీరు సృష్టించిన ఎన్నో శాశ్వతమైన చిత్రాలు ఎన్నో పాత్రలు ఎన్నో రికార్డులు ఎన్నో అవార్డులు అది మీకే సాధ్యం. మళ్లీ నటుడుగా వచ్చాక మీ రికార్డులు మీరే సాధిస్తారని అనేది భావన భారతదేశంలో ఉన్న అవార్డ్స్ రివార్డ్స్ అన్నీ మీకు సొంతం మీరు సాధించలేనిది అంటూ ఏమీ లేదు సాధించవలసింది ఒకే ఒక అవార్డు అదే భారతరత్న అవార్డు అది త్వరలో వస్తుందని అభిమానుల ఆశ !a అభిమానులకు నిజమైన పండుగ!

ఆ అవార్డు సాధించాక మీరు భారతదేశంలో ఉన్నఅవార్డులే కాదు ఎన్నో చిత్రాల్లో ఎన్నో పాత్రలు వేసి ఆ పాత్రలకు న్యాయం చేసిన నటుడుగా మహానటుడుగా మీకు మీరే సాటి! చెప్పాలంటే,.ఎంతో చరిత్ర మేధావులు సైతం ఒప్పుకున్నారు!!మీకోసం మీ చరిత్ర కోసం మీకు మీరే అనేది యావత్తు జగతికి తెలుసు అని ప్రత్యేకంగా చెప్పవలసింది ఏమీ లేదు. 90 ఏళ్ల నిజ జీవితంలో 70 ఏళ్లు నట జీవితంలో 256 చిత్రాల్లో నటించారు!! గల్లి నుంచి ఢిల్లీ దాకా మీరు సాధించిన అవార్డులు ఎన్నెన్నో అలాగే ఇతర దేశాల్లో ఎన్నో సన్మాన సత్కారాలు అందుకున్నారు. మీరు సాధించిన చరిత్ర ఈ తరం వరకే కాదు వచ్చే తరం వారికి కూడా ఆదర్శంగా నిలుస్తారని చెప్పక తప్పదు., నేడు మీజయంతి సందర్భంగా ఈ ప్రత్యేక ఆర్టికల్ మీకోసం ఎప్పటికీ మీ అభిమానులుగా ఉండటం అనేది నిజం !

# అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

**రెండోసారి అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ..**
**సోషల్ మీడియా ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించండి..**
**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి..**
**నూతనంగా ఎంపికైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేత..**





**ముద్ర, కరీంనగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను సోషల్ మీడియా ద్వారా ఇంటింటికి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుగ్గారం మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరి అయినా చెక్కులను, బుగ్గారం మండలంలోని వివిధ గ్రామా లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నియమించగా నియామక పత్రాలను మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదివారం బుగ్గారం మండలం శేకల్ల గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల చేసిన అవినీతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అసెంబ్లీలో వివరించాలని మంత్రి గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడుతారని భావించామని అయితే అసెంబ్లీకి రాకుండానే ప్రజా సమస్యలపై చర్చించకుండా రాద్ధాంతం చేసి బయటికి వెళ్లారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు గ్యారంటీలు అమలు చేస్తుందని రానున్న రోజుల్లో మరో రెండు గ్యారెంటీలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ధర్మపురిలో మూతపడిన నైట్ కళాశాలను తెరిపించడంతో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. రోళ్ళవాగు ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేస్తామని రంగధాం పల్లి చెరువు కూడిక దయతో పాటు యశ్వంతరావుపేట చెరువు కూడిక తీసి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలకు పెద్ద ఎత్తున నిధులు తీసుకు వస్తున్నామని ఇప్పటికే ప్రభుత్వం ధర్మపురి నియోజకవర్గానికి గోదావరి పుష్కరాలకు రూ, 117 కోట్లు కేటాయించిందని అభివృద్ధి పనులకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించిందని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి రాత్రి పగలు తేడా లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. ధర్మపురి కి బస్ డిపో సాధించడంతోపాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో నియోజకవర్గంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని మంత్రి కోరారు. బుగ్గార మండలం సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా బుగ్గారం మండలంలోని 56 మంది లబ్ధిదారులకు రూ. 15,54,400 విలువైన చెక్కులను మంత్రి లక్ష్మణ్ కుమార్ అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాగంగి నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, బుగ్గారం మండల పార్టీ అధ్యక్షులు నర్సాగౌడ్, మాజీ జెడ్పిటిసి బాదినేని రాజేందర్, శేకల్ల సర్పంచ్ రమేష్ సకల, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సుభాష్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేశ్ నిమజ్జనంలో హెలికాప్టర్‌తో పూలవర్షం



**ముద్ర, అనంతపురం :** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం లో నిమజ్జనం సందర్భంగా వినాయకుడి విగ్రహంపై హెలి కాప్టర్ తో పూల వర్షం కురిపిం చారు. గరిడి గణపతి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. బెంగ ళూరు నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన హెలికాప్టర్ తో పూలవర్షం కురిపిం చారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి నుంచి ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వేలాదిమంది తరలివచ్చారు. ఏడు రోజులుగా పట్టణంలో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి వినాయక విగ్రహాల శోభాయాత్ర మొదలైంది. ఈ సందర్భంగా భక్తులు కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం ఖాయం

**ఉప ఎన్నికను ఎదుర్కోలేక సుప్రీం కోర్టుకు దానం పని ఖతమైనట్టే..**
**కేసీఆర్ ఫాంహౌజ్ టూరిజం కేంద్రమా..**
**ఫాంహౌజ్ సందర్శన పెద్ద జోక్**
**ప్రైవేట్ భూములను సందర్శనకు మీకు అధికారం ఎక్కడిది.?**
**22ఏ సమస్య పరిష్కరించకపోతే న్యాయపోరాటం చేస్తాం**
**కేంద్రమంత్రి బండి సంజయ్**

**ముద్ర, కరీంనగర్ :** కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శలు చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం చేయడం ఖాయ మని ఎద్దేవా చేశారు. ఈరోజు ఆదివారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దానం నాగేందర్ తను వినాయకుడితో పోల్చుకోవడం సరికాదని పేర్కొన్నారు. వినాయకుడిని చివరిలో నిమజ్జనం చేస్తారనే విషయం దానం నాగేందర్‌కు తెలియదా.? అని ప్రశ్నించారు.దానం నాగేందర్ నిండు నూరేళ్లు జీవించాలని బండి సంజయ్ కోరుకున్నారు. కాంగ్రెస్ తమకు పోటీనే కాదని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నేతల ఫాంహౌస్ సందర్శన ఓ జోక్ లాగా ఉందని వ్యంగ్యంగా మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ ఫాంహౌస్‌లు ఏమైనా టూరిజానికి కేంద్రాలా.? అని ప్రశ్నించారు. ప్రైవేటు భూముల్లోకి వెళ్లడానికి కాంగ్రెస్ నేతలకు అధికారం ఎక్కడదని బండి సంజయ్ ప్రశ్నించారు.



# ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న మంత్రి పొన్నం



**ముద్ర, హైదరాబాద్:** ఖైరతాబాద్ మహాగణపతి ని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ సచిన్ సావంత్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ ఆదివారం దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. ఖైరతా బాద్ మహాగణపతిని దర్శించుకు నేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారని చెప్పారు. గత 72 ఏళ్లుగా ఖైరతా బాద్ మహా గణపతి ఉత్సవాలు ప్రజల విశ్వాసంతో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాల న ప్రభుత్వం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పండి, ప్రజ లంతా ఆయురారోగ్యాలతో ఉండాలని మహాగణపతిని ప్రార్థించినట్లు తెలిపారు.

# కోదాడ జాబ్ మేళాకు భారీ స్పందన

**ముద్ర, హైదరాబాద్ :** గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలనే లక్ష్యంతో కోదాడలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు భారీ స్పందన లభించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో సుమారు 350 కంపెనీలు పాల్గొనగా, 30 వేల మందికిపైగా ఉద్యోగార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంటర్వ్యూల అనంతరం 5,725 మంది అభ్యర్థులు తదుపరి నియామక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ అయ్యారు. ఈ మేళా గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంలో మైలురాయిగా నిలిచిందని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించాలని సూచించారు.

# ఇందిరమ్మ ఫ్లాట్ల లబ్ధిదారులకు రేపట్నుంచి అలాట్‌మెంట్ లెటర్స్



**ముద్ర, హైదరాబాద్:** ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్రకటించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సప్, ఎస్సెమ్మెస్ ద్వారా ఈ పత్రాలను పంపనున్నారు. అలాగే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో సుమారు రూ.750 కోట్లకు పైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మిస్తారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో, మార్కెట్లో దాదాపు రూ.50 లక్షల విలువ చేసే ఒక్కో ఫ్లాట్‌ను... కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందిస్తోంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్.. ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని ఇస్తోంది. కాగా, రేపు మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

# దళితుల భూమి అంగుళం కూడా ముట్టుకోం



**ముద్ర, హైదరాబాద్:** దళితులు, గిరిజనుల భూములను ప్రభుత్వం లాక్కోదని, వారి అంగుళం భూమికి కూడా రక్షణ ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. దళితుల భూముల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విషప్రచారాలను నమ్మొద్దని సూచించారు.దళితులు, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దేనని మంత్రి పేర్కొన్నారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ ద్వారా భూమిలేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ విధానమన్నారు. భూముల రికార్డుల పరిశీలన, రీ–సర్వే, సమస్యల పరిష్కారాన్ని భూములు లాక్కునే చర్యలుగా భావించవద్దని చెప్పారు.సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాలతో పాటు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. భూ హక్కులు కల్పించడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.కొంతమంది కావాలనే దళితుల్లో భయాందోళనలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దళిత, గిరిజనుల భూ హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని పొంగులేటి భరోసా ఇచ్చారు.

# నేను ఎవరి బాణాన్ని కాను.. బహుజనుల బాణాన్ని..

**రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత**
**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం వచ్చింది**
**అధర్మంపై ధర్మయుద్ధానికి సిద్ధమయ్యాం**
**ఉచిత వైద్యం, విద్యకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తాం**
**- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్**



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలో రాజకీయాలు అంటే కేవలం బూతులు తిట్టుకోవడమేనా అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించిన పాంచ జన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అరాచకా లు పెరిగిపోయాయని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతోందని ఆరోపించారు. ప్రభు త్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని అన్నారు. రైతుల సమస్యలపై స్పందిస్తూ.. నీళ్లు, యూరియా, ధాన్యం కోసం రైతులు అధికారుల కాళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కవిత ఆరోపించారు. పాలమూరు రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. తాను ఎవరి బాణం కాదని, తెలంగాణ బహుజనుల బాణమని పేర్కొన్నారు. ప్రజలంతా తెలంగాణ రక్షణ సేనను ఆశీర్వదించాలని కవిత పిలుపునిచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సమగ్ర సమాచార పత్రిక 'ముద్ర' లో
పని చేయాలనుకునే
జర్నలిస్టులకు
ఇదే మా ఆహ్వానం..
జిల్లాల స్టాఫర్లు
నియోజకవర్గ ఆర్సీ ఇన్‌చార్జిలు
మండలాల వారీగా రిపోర్టర్లు
అసక్తి, అర్హత ఉన్న వారు ఈ నంబర్లలో సంప్రదించగలరు..
99491 93555
90003 37676
VOICE FOR A BETTER SOCIETY

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 21.09.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




## ఫోన్ పోయిందా..
# ఇలా చేయండి
### పోలీస్ స్టేషన్‌కి వెళ్లేముందు ఇది తప్పనిసరి



అయ్యో! ఫోన్ పోయిందా? లేదా ఎక్కడైనా మరచిపోయి వచ్చారా? క్షణాల్లో గుండె ఆగినంత పనవుతుంది కదూ! అందులో ఉన్న ఫోటోలు, కాంటాక్టులు, అన్నింటికీ మించి బ్యాంకింగ్ యాప్స్ ఏమైపోతాయోనని భయం పట్టుకుంటుంది. వెంటనే పోలీస్ స్టేషన్‌కి పరుగులు తీయాలా అని కంగారు పడకండి. ఇప్పుడు మీ ఫోన్‌ను బ్లాక్ చేయడానికి లేదా దాన్ని వెతికి పట్టుకోవడానికి మీ చేతిలోనే ఓ సూపర్ ఆప్షన్ ఉంది. స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పనిలేకుండా, ఇంట్లో కూర్చుని మీ మొబైల్ నుంచే కంప్లైంట్ నమోదు చేసే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది.

**కేంద్ర ప్రభుత్వం 'మాస్టర్ ప్లాన్': CEIR పోర్టల్!**

పోగొట్టుకున్న లేదా దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను తిరిగి కనిపెట్టడానికి, దుర్వినియోగం కాకుండా చూడడానికి కేంద్ర టెలికాం శాఖ 'CEIR' (Central Equipment Identity Register) అనే ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మీ ఫోన్ 'IMEI' నంబర్‌ను బ్లాక్ చేస్తే, ఆ ఫోన్ ఎవరి చేతికి చిక్కినా అది కేవలం ఒక ప్లాస్టిక్ ముక్కలా మారిపోతుంది. అందులో వేరే ఏ కంపెనీ సిమ్ కార్డ్ వేసినా పనిచేయదు.

**ఆన్‌లైన్ కంప్లైంట్.. ఇలా నమోదు చేయండి!**

మీ ఫోన్ పోయిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఈ కింది సులభమైన స్టెప్స్ ఫాలో అవ్వండి: ముందుగా ప్రభుత్వం గుర్తింపు పొందిన సైట్ ceir.sancharsaathi.gov.in ను ఓపెన్ చేయండి. హోమ్ పేజీలో కనిపించే 'Block Stolen/Lost Mobile' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయండి. అక్కడ మీ ఫోన్ నంబర్లు, IMEI నంబర్లు, ఫోన్ మోడల్, కొనుగోలు చేసిన బిల్లు (ఉంటే) వివరాలను నమోదు చేయండి. ఫోన్ ఎక్కడ, ఏ తేదీన పోయిందో తెలిపే వివరాలతో పాటు, మీ ఆధార్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు కాపీని అప్‌లోడ్ చేయండి. చివరగా మీ ప్రత్యామ్నాయ మొబైల్ నంబర్‌కు వచ్చే OTP ని ఎంటర్ చేసి సబ్మిట్ కొడితే మీ ఫిర్యాదు పూర్తవుతుంది.

**సిమ్ మారిస్తే పోలీసులకు అలర్ట్!**

మీరు పోర్టల్‌లో రిక్వెస్ట్ పెట్టిన వెంటనే ఆ ఫోన్ నెట్‌వర్క్ నుంచి పూర్తిగా బ్లాక్ అవుతుంది. ఒకవేళ ఆ ఫోన్ దొంగిలించిన వ్యక్తి అందులో వేరే కొత్త సిమ్ కార్డ్ వేసి ఆన్ చేయడానికి ప్రయత్నిస్తే.. వెంటనే టెలికాం ఆపరేటర్లు, పోలీసుల సర్వర్లకు అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. ఆ సిమ్ ఆధారంగా ఫోన్ ఎక్కడుందో పోలీసులు సులభంగా ట్రాక్ చేసి మిమ్మల్ని సంప్రదిస్తారు.

**ఫోన్ దొరికితే అన్‌బ్లాక్ కూడా చేసుకోవచ్చు!**

ఒకవేళ మీ ఫోన్ మీకు తిరిగి దొరికితే కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇదే CEIR వెబ్‌సైట్‌లోకి వెళ్లి 'Un-Block Found Mobile' ఆప్షన్ ఎంచుకుని, ఫిర్యాదు చేసినప్పుడు వచ్చిన రిక్వెస్ట్ ఐడీని ఎంటర్ చేస్తే మీ ఫోన్ మళ్లీ నార్మల్ గా పని చేస్తుంది. కాబట్టి ఇకపై ఫోన్ పోయిందని కంగారుపడకుండా, వెంటనే సంచార్ సాథీ CEIR సేవలను ఉపయోగించుకోండి!

## ఐఫోన్: టెక్నాలజీని ఆపిల్
# మడత పెట్టింది




ఆపిల్ కంపెనీ అందరూ అంచనా వేసినట్టుగానే ఐఫోన్ 18 ప్రో మోడల్ ద్వారా టెక్నాలజీ మొత్తాన్ని మడత పెట్టింది. తాను రూపొందించిన ఫోన్లో ఇంతవరకు ఫోల్డబుల్ నమూనా ను ఆపిల్ ఇంతవరకు మార్కెట్లోకి తీసుకురాలేదు. కానీ తొలిసారి మడత పెట్టే ఫోన్ ను తీసుకొచ్చి సంచలనానికి నాంది పలికింది..

ఐఫోన్ డ్యుయో, ఐఫోన్ 18 సిరీస్‌ను ఆపిల్ ప్రపంచానికి పరిచయం చేసింది. కాలిఫోర్నియాలోని ఆపిల్ పార్క్ లో జరిగిన సర్ప్రైజ్ అండ్ షైన్ కార్యక్రమంలో ఆపిల్ కంపెనీ సీఈవో జాన్ టెర్నెస్ ఆపిల్ నూతన ఉత్పత్తుల వివరాలను ప్రకటించారు. ఈ ఫోన్లు స్టార్ వైట్.. నైట్ స్కై రంగులలో లభ్యం అవుతాయి..ఇక మడత పెట్టే ఫోన్..దానిని విప్పినప్పుడు అత్యంత పల్చటి ఐఫోన్ లాగా మారిపోతుంది. దీనికి ఐఓఎస్ 27 ను రీ డిజైన్ చేశారు. 7.6 అంగుళాల సూపర్ రెటీనా ఎక్స్ డీ ఆర్ డిస్ ప్లే (మడత తీసినప్పుడు) రెండు హోం స్క్రీన్ పేజెస్, మెయిల్, మెసేజెస్ పంపి కంటెంట్ కళ్ల ముందు కనిపిస్తుంది. ఇక రెండు అప్లికేషన్లను పక్క పక్కన ఒకేసారి వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఫోన్ మడత పెట్టినప్పుడు (5.4 అంగుళాలు) బెడ్ సైడ్ క్లాక్ (విడ్జెట్స్, వెదర్, క్యాలెండర్, మ్యూజిక్) లాగా ఉంది.

**ఐఫోన్ 18 ప్రో**

★ఐఫోన్ 18 ప్రో, ప్రో మాక్స్ మోడళ్లు మనదేశంలో 256 జీబీ, 512 జిబి, 1 టీబీ, 2 టీబీ స్టోరేజీల్లో లభిస్తుంటాయి. సిల్వర్.. గ్లేషియర్ బ్లూ.. డీప్ బ్లాక్.. బర్గుండి వంటి రంగుల్లో ఈ ఫోన్ లభిస్తాయి.

★6.3 అంగుళాల పరిమాణంలో ఉన్న ఈ ఫోన్లో ఏఐ ఆధారిత సిరి అందుబాటులో ఉంది.

★ఇమేజ్ విషయంలో ప్లేగ్రౌండ్ వంటి ఏఐ టూల్స్‌ను ఆపిల్ ఇందులో పొందుపరిచింది.

★ఏ 20 ప్రో చిప్, 7 కోర్ జీపీయూ, 6 కోర్ సీపీయూ వల్ల ఈ ఫోన్ సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది.

★36 గంటల పాటు వీడియో ప్లేబ్యాక్ సామర్థ్యం.. 15 నిమిషాల్లోనే 50% చార్జింగ్ పొందే సామర్థ్యం.. ఒక ఛార్జింగ్ తోనే 24 గంటల వినియోగం వంటి సౌలభ్యాలు ఇందులో ఉన్నాయి.

★48 ఎంపీ ఫ్యూజన్ మెయిన్ కెమెరాలో ఆస్ట్రో ఫోటోగ్రఫీ.. నైట్ మోడ్ మరింత మెరుగ్గా కనిపిస్తుంటాయి. 4కే రిజల్యూషన్, డాల్బీ విజన్, హెచ్డిఆర్లో టైం లాప్స్, ప్రో కంట్రోల్స్, యాపిల్ ఇంటెలిజెంట్ ఫీచర్లు ఉన్నాయి.

**ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్**

6.9 అంగుళాల పరిమాణంలో ఐఫోన్ ప్రో మాక్స్ అందుబాటులో ఉంటుంది. ఐఫోన్ 18 ప్రోలో ఫీచర్లు మరింత విస్తృతంగా ఉంటాయి. ఇందులో ఒక చార్జింగ్ తోనే 30 గంటల పాటు ఫోన్ వినియోగించుకునే అవకాశం ఉంటుంది. 45 గంటల పాటు వీడియో ప్లే బ్యాక్ వంటి సౌలభ్యం ఉంటుంది.

**ఎయిర్ పాడ్స్**

ఓపెన్ ఇయర్ డిజైన్‌తో ఇది రూపొందింది. అంకితం ఎయిర్ పాడ్స్ తో పోసి చూస్తే బయట శబ్దాలను తగ్గించారు. లైవ్ ట్రాన్స్ లేషన్.. సిరి వంటి ఇతర ఇంటిలిజెంట్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. వీటిని హాండ్స్ ఫ్రీ మోడ్ లో కూడా వాడుకోవచ్చు. కెమెరా రిమోట్.. వ్యాల్యూమ్ స్వైప్ వంటి ఫ్యూచర్లు కూడా ఇందులో ఉన్నాయి.

**ఆపిల్ వాచ్ సిరీస్ 12..**
**ఆపిల్ వాచ్ అల్ట్రా 4**

ఇందులో ఏఐ ఆధారిత ఆడియో ఫీచర్లు ఉన్నాయి. లైవ్ రివైండ్ ఫీచర్లో 15 సెకండ్లకు సంబంధించిన ముందు సంభాషణ కూడా లభిస్తుంది. ఇందులో సరికొత్త హెల్త్ సెన్సార్ వ్యవస్థ ఉంది. మెరుగైన ఈసీజీ.. ఆప్టికల్ సెన్సింగ్ వంటివి ఇందులో ఉన్నాయి. ప్రతి 5 సెకండ్లకు ఒకసారి హృదయ స్పందన నమోదు అవుతూ ఉంటుంది. క్రితంతో పోల్చి చూస్తే ఇది 60 రెట్లు ఎక్కువ. నిద్ర.. శరీరంలో ఉన్న రక్తం.. వంటి వాటి డేటాను వాస్తవ వయసుతో.. వాస్తవ ఆరోగ్య సంకేతాల పోలికను కూడా ఇది అందిస్తూ ఉంటుంది.

**ధరలు ఇలా..**

| ఐఫోన్ 18 ప్రో | ఐఫోన్ 18 ప్రో మాక్స్ | ఐఫోన్ డ్యూయో |
|---|---|---|
| 256 జిబి 1,64,900 | 256 జిబి 1,79,900 | 256 జిబి 2,99,900 |
| 512 జిబి 1,89,900 | 512 జిబి 2,04,900 | 512 జీబీ 3,24,900 |
| 1 టీబీ 2,39,900 | 1 టీబీ 2,54,900 | 1 టీబీ 3,74,900 |
| 2 టీబీ 3,14,900 | 2 టీబీ 3,29,900 | 2 టీబీ 4,49,900 |

## 3 కంపెనీలను హ్యాక్ చేసిన
# జెమినై ఏఐ..!




అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఓపెన్‌ఏఐకి చెందిన కృత్రిమ మేధ ఏజెంట్ సైబర్ దాడికి పాల్పడినట్లు తెలిసింది. తాజాగా గూగుల్ కు చెందిన ఏఐ మోడల్ 'జెమినై ఏఐ కూడా 3 కంపెనీలను హ్యాక్ చేసింది. ఈ విషయాన్ని గూగుల్ ధ్రువీకరించింది. AI ఏజెంట్ల దాడి సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ సంస్థ ఇటీవల సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను రూపొందించింది. దానిని పరీక్షిస్తున్న సమయంలో జెమినై తన నిర్దేశిత పరిధులను దాటి.. మూడు ఇతర కంపెనీలకు చెందిన డిజిటల్ సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే తమ ఏఐ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ పనిచేయడం దానంతట అదే ఆగిపోయిందని తెలిపింది.

''సైబర్ సెక్యూరిటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఇతర పాస్‌వర్డ్‌లను ఊహించి జెమినై ఏఐ బహిరంగ వెబ్ నుంచి మరో మూడు కంపెనీల డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలోకి అనధికారికంగా ప్రవేశించింది. ఈ హ్యాకింగ్ వల్ల ప్రభావిత కంపెనీల డేటాకు ఎటువంటి హాని జరగలేదని ధ్రువీకరించుకున్నాం. ఈ విషయంలో మా ఏఐ బాధ్యతాయుతంగా వ్యవహరించింది. హ్యాకింగ్ వల్ల ప్రభావితమైన సంస్థలను ఇప్పటికే సంప్రదించాం. ఆయా సంస్థలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం వల్ల ఈ సమస్య తలెత్తింది. శక్తిమంతమైన ఏఐ నమూనాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా వాటికి శిక్షణ ఇవ్వడం ఎంత ముఖ్యమో దీని ద్వారా తెలిసింది'' అని గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ వైస్ ప్రెసిడెంట్ హీథర్ అడ్కిన్స్ వెల్లడించారు.

# బెస్ట్ గేమింగ్ ఫోన్లు..

స్మార్ట్‌ఫోన్‌లో గేమింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చే వారికి రూ.75,000లోపు సెగ్మెంట్‌లో ప్రస్తుతం ఎన్నో ఆసక్తికరమైన ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి. పవర్‌ఫుల్ ప్రాసెసర్లు, హై రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లేలు, పెద్ద బ్యాటరీలు, ఫాస్ట్ ఛార్జింగ్‌తో పాటు ప్రత్యేక కూలింగ్ సిస్టమ్స్ కూడా ఈ ఫోన్లలో ఉన్నాయి. రోజువారీ వినియోగంతో పాటు హై-ఎండ్ గేమింగ్‌ను నిర్వహించగల కొన్ని మోడల్స్.

**iQOO 15**




గేమింగ్ ఫోన్లలో iQOO 15 ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇందులో Snapdragon 8 Elite Gen 5 ప్రాసెసర్, 16GB వరకు LPDDR5X RAM, 512GB UFS 4.1 స్టోరేజ్ ఉన్నాయి. 6.85 అంగుళాల 2K LTPO AMOLED డిస్‌ప్లే 144Hz రిఫ్రెష్ రేట్‌ను అందిస్తుంది. 8K VC కూలింగ్ సిస్టమ్‌తో హీట్‌ను నియంత్రించేలా రూపొందించారు. 7,000mAh బ్యాటరీ, 100W వైర్డ్, 40W వైర్‌లెస్ ఛార్జింగ్ సపోర్ట్ ఉన్నాయి. అయితే దీని ప్రారంభ ధర రూ.76,999 కావడంతో రూ.75 వేల బడ్జెట్‌ను కొద్దిగా దాటుతుంది.

**OnePlus 15R**

గేమింగ్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన మరో ఫోన్ OnePlus 15R. ఇందులో Snapdragon 8 Gen 5 చిప్‌సెట్, 16GB వరకు RAM, 512GB స్టోరేజ్ ఉన్నాయి. 6.83 అంగుళాల AMOLED స్క్రీన్ 165Hz రిఫ్రెష్ రేట్‌తో వస్తుంది. ప్రత్యేక Touch Response Chip, G2 Wi-Fi Chip, వేపర్ ఛాంబర్ వంటి ఫీచర్లు గేమింగ్ అనుభవాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. 7,400mAh బ్యాటరీ, 80W ఫాస్ట్ ఛార్జింగ్ ఉన్నాయి. దీని ధర రూ.59,999 నుంచి ప్రారంభమవుతుంది.

**Motorola Edge 70 Max**




Motorola Edge 70 Maxలో Snapdragon 8 Gen 5 ప్రాసెసర్‌తో పాటు 5,500 చదరపు మిల్లీమీటర్ల వేపర్ ఛాంబర్ ఉంది. 6.8 అంగుళాల QHD+ AMOLED డిస్‌ప్లే 144Hz రిఫ్రెష్ రేట్‌ను అందిస్తుంది. 7,100mAh బ్యాటరీ, 90W వైర్డ్, 25W వైర్ లెస్ ఛార్జింగ్ సపోర్ట్ ఉన్నాయి. ధర రూ.54,999 నుంచి ప్రారంభమవుతుంది.

**Vivo X200T**

Vivo X200Tలో MediaTek Dimensity 9400+ చిప్‌సెట్, 12GB RAM, 512GB వరకు స్టోరేజ్ ఉన్నాయి. 6.67 అంగుళాల AMOLED డిస్‌ప్లే 120Hz రిఫ్రెష్ రేట్‌తో వస్తుంది. 6,200mAh బ్యాటరీ, 90W వైర్డ్, 40W వైర్‌లెస్ ఛార్జింగ్ ప్రత్యేకతలు. ధర రూ.59,999 నుంచి ప్రారంభమవుతుంది.

**Poco X8 Pro Max**

బడ్జెట్‌లో భారీ బ్యాటరీ, గేమింగ్ పనితీరు కోరుకునేవారికి Poco X8 Pro Max మరో ఆప్షన్. ఇందులో Dimensity 9500s చిప్‌సెట్, 12GB RAM, 512GB వరకు స్టోరేజ్ ఉన్నాయి. 6.83 అంగుళాల 1.5K AMOLED డిస్‌ప్లే 120Hz రిఫ్రెష్ రేట్‌తో వస్తుంది. ముఖ్యంగా 9,000mAh భారీ బ్యాటరీ, 100W ఫాస్ట్ ఛార్జింగ్, 3D Ice Loop కూలింగ్ సిస్టమ్ ఉన్నాయి. ధర రూ.48,999 నుంచి ప్రారంభమవుతుంది.




# సముద్ర గర్భంలో చైనా ఎలక్ట్రిక్ చేప

టెక్నాలజీలో రోబోటిక్స్ పాత్ర రోజురోజుకూ సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఇప్పటికే హ్యూమనాయిడ్లు ఈ ప్రపంచానికి పరిచయం అయ్యాయి. దీన్ని మరో మలుపు తిప్పింది చైనా. తాజాగా ఓ నూతన రోబోను ఆవిష్కరించింది. బీజింగ్‌లో ఏర్పాటైన చైనా ఇంటర్నేషనల్ ఫెయిర్ ఫర్ ట్రేడ్ ఇన్ సర్వీసెస్ ఎగ్జిబిషన్ లో దీన్ని ఈ ప్రపంచానికి పరిచయం చేసింది. ఊహకు కూడా అందని ఇన్వెన్షన్ అది. అందరి దృష్టినీ ఆకర్షించింది. బీజింగ్ టెక్ ఫెయిర్ లో సెంటర్ ఆఫ్ ది అట్రాక్షన్ గా నిలిచింది. అదే.. రోబోటిక్ ఫిష్. నిజం అనిపించేలా భ్రమింపజేసే చేప అది. నీటితో నింపిన ఓ ట్రేలో అచ్చం చేపలాగే ఎంతో సునాయాసంగా ఈత కొడుతున్న నూతన బయోనిక్ రోబోటిక్ ఫిష్ ను ఈ బీజింగ్ టెక్ ఫెయిర్‌లో ప్రదర్శనకు ఉంచారు. జలచరాల సహజ కదలికలను తలపించేలా ఉన్న ఈ రోబోను చూసి సందర్శకులు ముక్కున వేలేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో అరుదైన, అత్యంత ఖరీదైన అరోవానా (Arowana) రకానికి చెందిన చేప ఆకృతిని ప్రేరణగా తీసుకుని రూపొందించారు. దీని విలక్షణమైన రూపాన్నే కాకుండా, నీటిలో దాని కదలికలను కూడా ఈ రోబోలో అచ్చుగుద్దినట్లు అమర్చారు. ఫ్లూయిడ్ సిమ్యులేషన్ (Fluid Simulation) అనే అత్యాధునిక సాంకేతికత ఆధారంగా ఈ బయోనిక్ చేప పనిచేస్తుంది. దీనివల్ల నీటి ప్రవాహ తీవ్రతకు అనుగుణంగా ఇది ఈదగలుగుతుంది.

ఈ అరుదైన బయోనిక్ చేపను డెవలప్ చేయడానికి కారణాలు లేకపోలేదు. విభిన్న రకాల సముద్ర గర్భ పరిశోధనల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు దీన్ని. సాధారణంగా సముద్రంలోకి మానవ ప్రమేయం ఉన్న ఇతర భారీ యంత్రాలు గానీ సబ్మెర్సిబుల్స్ పంపినప్పుడు అక్కడి నివసించే జలచర జీవులు భయాందోళనలకు గురి అవుతాయి. వాటికి బదులుగా ఈ రోబోటిక్ చేపను సముద్రగర్భంలోకి పంపించాలనేది చైనా ఆలోచన. అచ్చం చేపలాగే కనిపించడం వల్ల సముద్ర జీవులను ఇది ఎంతమాత్రం ఇబ్బందిగా అనిపించదు. వాటి సహజ సిద్ధమైన ఆవాసాల్లోని జీవన విధానాన్ని సురక్షితంగా, సునిశితంగా పరిశీలించడానికి ఈ రోబో ఫిష్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రోబోటిక్ చేపను నడిపించడానికి ఎటువంటి ప్రొపెల్లర్లు వాడలేదు. బదులుగా తోక, రెక్కల కదలికల ద్వారానే ఇది ముందుకు కదులుతుంది. ఇందులో అమర్చిన అత్యాధునిక లొకేటర్ సెన్సార్లు, కెమెరాల సహాయంతో ఇది ఆటోమేటిక్ గా ఈదగలుగుతుంది.

సముద్ర గర్భానికి వెళ్తోన్నప్పుడు పెద్ద రాళ్లు, ఇతర అడ్డంకులు ఏవైనా వస్తే వాటిని ముందుగానే గుర్తించి, తన దిశను మార్చుకునేలా దీనిని డిజైన్ చేశారు. ఈ వినూత్న సాంకేతికత ద్వారా రిజర్వాయర్లల్లో నీటి నాణ్యతను సైతం పరీక్షించడానికి అవసరమైన శాంపిళ్లను కూడా సేకరించవచ్చని చైనా చెబుతోంది. ప్రస్తుత రోజుల్లో జల కాలుష్యం అనేది ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద పర్యావరణ సమస్యగా రూపాంతరం చెందింది. ఈ నేపథ్యంలో.. ఈ బయోనిక్ రోబోటిక్ ఫిష్ వంటి అధునాతన యంత్రాల సహాయంతో నదులు, చెరువులు, సముద్రాల్లోని కాలుష్య కారకాలను నిరంతరం పర్యవేక్షించడం సులువవుతుంది. పర్యావరణ రక్షణ రంగంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం ఏ విధంగా అద్భుతాలు సృష్టించగలదో నిరూపించడానికి ఈ ప్రాజెక్ట్ గొప్ప నిదర్శనంగా నిలిచింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 21.09.2026
www.mudranews.in | @mudranews



**పడుకునే ముందు మూత్రవిసర్జన చేయండి**

నిద్రకు వెళ్లే ముందు తప్పనిసరిగా మూత్రవిసర్జన చేయడం అలవాటుగా చేసుకోండి. దీంతో రాత్రి ప్రారంభంలోనే మూత్రం కోసం లేవాల్సిన అవసరం కొంత తగ్గవచ్చు.



# వినాయక నిమజ్జనానికి అభేద్యమైన భద్రతా వలయం

**విఘ్నేశ్వరుడి వేడుకలకు విఘ్నం తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ**
**'గణేశ్ సురక్షా సంకల్ప్–2026' పేరుతో పకడ్బందీ ఏర్పాట్లు**
**15 వేల విగ్రహాలు వస్తాయని అంచనా..**
**ఇప్పటికే ఆరు వేల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు**
**5,874 మంది పోలీసులతో బందోబస్తు..**
**అదనంగా బయటి విభాగాల బలగాలు**
**ఐదు వేల సీసీ కెమెరాలతో నిరంతర నిఘా**
**పది అడుగులకు మించిన విగ్రహాల మండపాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి**
**ప్రతి మండపం ఆన్‌లైన్‌లో నమోదు కావాలి**
**మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి**



**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 20:** విఘ్నాలను తొలగించే వినాయకుడి ఉత్సవాలకు ఎలాంటి విఘ్నం తలెత్తకుండా, భక్తుల ఆనందానికి భద్రతను కవచంగా నిలిపే లక్ష్యంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. వినాయక చవితి ఉత్సవాల నుంచి నిమజ్జన ఘట్టం వరకు ప్రతి దశను పకడ్బందీగా పర్యవేక్షించేందుకు 'గణేశ్ సురక్షా సంకల్ప్–2026' పేరుతో సమగ్ర భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి వెల్లడించారు. పునర్వ్యవస్థీకరణ అనంతరం పూర్తిగా పట్టణ స్వరూపంతో ఏర్పడిన మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొలిసారిగా భారీ స్థాయిలో గణేశ్ నిమజ్జన కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో, భద్రతా ఏర్పాట్లలో ఎక్కడా చిన్నపాటి లోపానికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తి ఉత్సాహానికి క్రమశిక్షణను, ఊరేగింపుల ఆనందానికి అప్రమత్తతను జోడిస్తూ పోలీస్ శాఖ సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. గత ఏడాది 11 వేలకుపైగా గణేశ్ విగ్రహాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని, ఈసారి విగ్రహాల ప్రతిష్ఠాపన పూర్తికాకముందే దాదాపు ఆరు వేల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని సీపీ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం సుమారు 15 వేల విగ్రహాలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గతంలో హైదరాబాద్ నగర నార్త్‌జోన్ పరిధిలో ఉన్న అనేక పోలీస్ స్టేషన్లు ఇప్పుడు మల్కాజిగిరి కమిషనరేట్‌లో చేరడంతో ప్రధాన నిమజ్జన కార్యక్రమంలో కమిషనరేట్ బాధ్యత మరింత పెరిగిందన్నారు. సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు జరిగే ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల కోసం సుమారు 5,874 మంది పోలీస్ సిబ్బందిని రంగంలోకి దింపుతున్నట్లు తెలిపారు. వీరితోపాటు ఇతర విభాగాలు, బయటి యూనిట్ల నుంచి వచ్చే అధికారులు, అదనపు బలగాల సేవలను కూడా వినియోగించుకుంటున్నట్లు వివరించారు. భద్రతా ప్రణాళికలో భాగంగా ప్రతి గణేశ్ మండపం, ప్రతి విగ్రహం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు కావాలని సీపీ బడుగుల సుమతి స్పష్టం చేశారు. గణేశ్ ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులు స్థానికంగా ప్రతిష్ఠించే ప్రతి విగ్రహాన్ని నమోదు చేయించాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా మండపం ఉన్న ఖచ్చితమైన ప్రదేశం, నిమజ్జనానికి తీసుకెళ్లే మార్గం, ఊరేగింపు వివరాలు, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సమాచారం పోలీస్ శాఖకు అందుతుందన్నారు. ప్రతి మండపం వద్ద ఉన్న కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విగ్రహం ప్రతిష్ఠించిన నాటి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వెంటనే స్పందించడంతోపాటు ఊరేగింపులను సురక్షిత మార్గాల్లో నడిపించడానికి వీలవుతుందని చెప్పారు. పది అడుగులకు మించిన గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించే మండపాల నిర్వాహకులు సొంతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడాన్ని తప్పనిసరి చేసినట్లు సీపీ వెల్లడించారు. పది అడుగులలోపు ఉన్న చిన్న విగ్రహాల మండపాలకు క్లస్టర్ విధానంలో కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కమిషనరేట్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, నిమజ్జన మార్గాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న సుమారు ఐదు వేల సీసీ కెమెరాలను గుర్తించి, వాటి ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం చివరి రోజున భారీగా తరలివచ్చే విగ్రహాలు, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడో రోజు నిమజ్జన ఊరేగింపులు ప్రారంభమైన అనంతరం పరిస్థితులను సమీక్షించి, రెండో విడతలో ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల మళ్లింపు, ప్రత్యామ్నాయ మార్గాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడిస్తామన్నారు. బందోబస్తు, సాంకేతిక నిఘా, ట్రాఫిక్ నియంత్రణ, మండపాల నిర్వాహకులతో సమన్వయం——ఈ నాలుగు ప్రధాన అంశాల ఆధారంగా భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు సీపీ బడుగుల సుమతి తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, నిమజ్జన యాత్రలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు గణేశ్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ సమితులు, భక్తులు పోలీస్ శాఖకు సంపూర్ణంగా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. భక్తితో పూజించిన గణనాథుడిని అదే భక్తితో, బాధ్యతతో సాగనంపాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఉత్సవ ఆనందాన్ని దూరం చేయకుండా ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటించాలని సీపీ సుమతి పిలుపునిచ్చారు.

## గణేశ్ సన్నిధిలో అన్నదానం

**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి భారతీయ జనతా పార్టీ కార్యాలయ ప్రాంగణంలో "కూకట్‌పల్లి వినాయక భక్త బృందం" ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ బొజ్జ గణపతి స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు సౌజన్యంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. అన్నదాన పంపిణీకి ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకకు కూకట్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి తన సేవా నిరతిని చాటుకున్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నాయినేని సూర్యప్రకాష్ రావు, నాయకులు హర్షణపల్లి సూర్యారావు, చౌదరి నర్సింగరావు, నాయినేని పద్మారావు, చౌదరి సూర్యారావు తదితర ముఖ్య నేతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## బొమ్మన్నగారి జైపాల్ కురుమ జన్మదిన వేడుకలు




**ముద్ర, చేవెళ్ల. శంకర్ పల్లి:** పురపాలిక పరిధిలోని అయ్యప్ప రెడ్డి గూ డకు చెందిన ప్రముఖ uపారిశ్రామిక వేత్త బొమ్మన గారి జైపాల్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురపాలక పరిధిలోని కేసీమ్ కాన్వెంషన్ లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పూల మాలలు, శాలువాలతో సత్కారించి కేక్ కొయంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో పేదలకు సేవలు అందించాలని, ఆయురారోగ్యలతో చల్లంగా ఉండాలని ఆకాంక్షంచారు. కార్యక్రమం లో పురపాలిక చైర్మన్ ప్రవీణ్ కుమార్, డీసీసీ వైస్ చైర్మన్ గోపాల్ రెడ్డి, నాయకులు కాశీట్టి మోహన్, ప్రకాష్ గుప్తా, బాల కృష్ణ, శ్రీనివాస్ ముదిరాజ్, మాశెట్టి రాఘవేందర్, శ్రీశైలం, చంగల్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



**ముద్ర, కూకట్‌పల్లి:** కె పి హెచ్ కాలనీ పరిధిలో ఉన్న ఓ హాస్టల్‌లో బీ.టెక్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం, ముత్తనపల్లి గ్రామానికి చెందిన చిరుమామిళ్ల ప్రవీణ్ కుమార్ (23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ హైదరాబాద్ మాదాపూర్‌లోని ఒక హాస్టల్‌లో నివాసముంటున్నాడు. వారం రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లిన ప్రవీణ్ కుమార్, ఈ నెల 19న తన బాబాయి కుమారుడైన వడ్లవల్లి గణేష్‌తో కలిసి తిరిగి హైదరాబాద్ చేరుకున్నాడు. అదే రోజు ఉదయం 8:00 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీలో బస్సు దిగి, రోడ్డు నంబర్ 2, ధనలక్ష్మి టిఫిన్ సెంటర్ సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ మేన్స్ హాస్టల్‌కు వెళ్లారు. ఒక రోజు ఇక్కడే ఉండి మరుసటి రోజు మాదాపూర్ హాస్టల్‌కు వెళ్తానని గణేష్‌కు చెప్పడంతో, అతడు విధుల నిమిత్తం బయటకు వెళ్లాడు. ఆ తర్వాత ప్రవీణ్ కుమార్ హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి హాస్టల్ వాసులు తలుపులు బద్దలుగొట్టి చూశారు. వర్షపు నీటి పైపు ఐరన్ రాడ్‌కు కండువాతో ఉరివేసుకుని ప్రవీణ్ కుమార్ వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న స్థానిక వైద్య సిబ్బంది వచ్చి పరిశీలించగా, అతడు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. సంఘటనపై సమాచారం అందుకున్న మృతుడి తమ్ముడు, బి.టెక్ రెండో సంవత్సరం చదువుతున్న చిరుమామిళ్ల ధనుష్ (19) వెంటనే కేపీహెచ్‌బీకి చేరుకున్నాడు. ఏడాది క్రితం తండ్రి వదిలేసి వెళ్లడం, సరైన ఉద్యోగం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు మరియు ఇతర వ్యక్తిగత కారణాల వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ప్రవీణ్ కుమార్ ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని ధనుష్ తెలిపాడు. ఈ ఘటనలో ఎవరిపైనా అనుమానం లేదని వెల్లడిస్తూ, అన్న మృతిపై చట్టపరమైన విచారణ జరిపి అసలు కారణాలు తేల్చాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## షాబాద్‌లో జూనియర్ కళాశాల, 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

**ఎమ్మెల్యే యాదయ్యకు వినతిపత్రం అందజేసిన జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు**



**ముద్ర, చేవెళ్ల:** మండల కేంద్రమైన షాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని షాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కోరింది. ఈ మేరకు ఆదివారం సంఘం ఆధ్వర్యంలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. షాబాద్‌కు చారిత్రక ప్రాధాన్యం ఉన్నప్పటికీ, మండల కేంద్రానికి అవసరమైన విద్యా, వైద్య సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని తెలిపారు. గతంలో తహసీల్‌గా ఉన్న సమయంలో ఇబ్రహీంపట్నం, పరిగి, చేవెళ్ల తదితర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం ప్రజలు షాబాద్‌కు వచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం పట్టణ అభివృద్ధికి అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అదేవిధంగా గతంలో జనరల్ ఆసుపత్రిగా ఉన్న ఆసుపత్రిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చడంతో వైద్య సేవల పరిధి తగ్గిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. సుమారు 16 ఏళ్ల క్రితం ఆసుపత్రి కోసం నిర్మించిన భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉందని, దానిని 30 పడకల ఆసుపత్రి అవసరాలకు అనుగుణంగా వినియోగంలోకి తీసుకురావాలని వినతి పత్రంలో కోరారు. షాబాద్ మండలంలోని హైతాబాద్, సీతారాంపురం గ్రామాలు పారిశ్రామికంక అభివృద్ధి చెందుతు న్నాయని ఉపాధి ఆవకాశాల మెరుగు కోసం శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రంపై ఎమ్మెల్యే యాదయ్య సానుకూలంగా స్పందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. జూనియర్ కళాశాల మంజూరు, ఆసుపత్రి అప్‌గ్రేడ్ అంశాలను సంబంధిత శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు యాదగిరి, శ్రీనివాస్, బాలరాజ్, హరికుమార్, రామచందర్ తదితరులు ఉన్నారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం' స్వర్ణోత్సవాలు

**రెడ్‌హిల్స్ రాష్ట్ర కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరించిన నాయకులు**



**ముద్ర, కూకట్పల్లి :** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం (ఎ.ఐ.ఎ.వై.యస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం రెడ్‌హిల్స్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 27వ తేదీన ఘనంగా నిర్వహించనున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం 50 ఏళ్ల 'గోల్డెన్ జూబ్లీ' (స్వర్ణోత్సవ) కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను (బ్రోచర్‌ను) రాష్ట్ర నాయకులు ఆవిష్కరించారు. అనంతరం స్వర్ణోత్సవ వేడుకలను దిగ్విజయం చేసేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి పలువురు నాయకులకు వివిధ బాధ్యతలను అప్పగించారు. అలాగే, సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, ఆ నివేదికలను వీలైనంత త్వరగా రాష్ట్ర కమిటీకి అందజేయాలని జిల్లా కమిటీలను ఆదేశించారు. నూతన కమిటీ ఎన్నిక, సీనియర్లకు సన్మానం. ఈ నెల 27న జరగబోయే ప్రధాన కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోనున్నట్లు నాయకులు తెలిపారు. దీనితో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిని మూడు విభాగాలుగా (సైబరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, హైదరాబాద్ కార్పొరేషన్) విభజించి, వాటికి నూతన అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులను నియమించనున్నట్లు వెల్లడించారు. 1977లో సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించి, సంఘ అభివృద్ధికై విశేష సేవలందించిన సీనియర్ నాయకులను ఈ వేడుకల్లో భాగంగా ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాతీయ కోఆర్డినేటర్ ఎస్. వరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్క నాగరాజు, నాయకులు దాసరి ప్రభు, దుప్పడ అప్పలరాజులతో పాటు గ్రేటర్ నాయకులు మంజుల, శాతిరి వినయ్ కుమార్, తల్లరి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఏపీలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు..




ఆంధ్రప్రదేశ్ లో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ తక్షణమే అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ బదిలీలకు సంబంధించి అధికారులు, వారి కొత్త పోస్టింగ్ వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీఎఫ్ డీజీగా పనిచేస్తున్న సీహెచ్ త్రివిక్రమ వర్మను డైరెక్టర్ ఎఫ్ఎస్ఎల్‌గా ప్రభుత్వం నియమించింది. ఏసీబీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన జయలక్ష్మి ని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వే ఐజీగా బదిలీ చేయడంతో పాటు, సీఐడీ ఉమెన్ సేఫ్టీ ఐజీగా కూడా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణా టాటాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ ఐజీగా పోస్టింగ్ దక్కింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో అధికారి విశాల్ గున్నికి ట్రైనింగ్ డీఐజీగా పోస్టింగ్ కేటాయించారు. గ్రేహౌండ్స్ డీఐజీగా సేవలందించిన బాబూజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేయడం జరిగింది. పోలవరం ఓఎస్డీగా పనిచేసిన పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. సీఎంఎస్‌జీ ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించిన జగదీశ్ అదహళ్లిని పల్నాడు జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. సీఐడీ ఎస్పీగా ఉన్న కే. చక్రవర్తిని పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ద్వారా పలు కీలక శాఖలు , జిల్లాలకు నూతన అధికారులను కేటాయించడం జరిగింది. ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఈ ఐపీఎస్ అధికారుల మార్పులు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, పాలనాపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 21.09.2026
www.mudranews.in | @mudranews



**రాత్రి మూత్రవిసర్జన తగ్గేందుకు మందుల సమయంపై వైద్యుడిని సంప్రదించండి**

బీపీ లేదా వాపుల కోసం డైయూరిటిక్ మందులు వాడు తున్నట్లయితే, వాటి సమయం రాత్రి మూత్రవిసర్జనపై ప్రభావం చూపవచ్చు. మందుల సమయాన్ని స్వయంగా మార్చకుండా వైద్యుడితో మాట్లాడి నిర్ణయించుకోవాలి.



## వైభవంగా వినాయక శోభాయాత్ర.. డ్యాన్స్ చేసిన మంత్రి అడ్లూరి..



**ముద్ర, ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన శోభాయాత్ర కన్నుల పండుగగా జరిగింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం కార్యక్రమం ఆదివారం ధర్మపురిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డ్యాన్స్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభమైన శోభాయాత్ర ధర్మపురి పట్టణ పురవీధుల్లో గణనాధుని ఊరేగిస్తూ గోదావరి నది తీరం వరకు సాగింది. భక్తుల కొలహాలం మధ్య గోదావరి నదిలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆద్యాంతం వైభవంగా సాగిన శోభాయాత్రకు ధర్మపురి ప్రజలు అడుగడుగున నీరాజనం పలికారు.

## పార్టీ ఫిరాయింపుల చట్టంలో లోపాలు సరిచేయాలి

**సీపీఐ నారాయణ**

**ముద్ర, హైదరాబాద్ :** పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని లోపాలను సరిచేయకుండా వదిలేయడం వల్ల దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా. కే. నారాయణ అన్నారు. పార్టీ ఫిరాయింపులను అడ్డుకునేలా చట్టాన్ని మరింత కఠినతరం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఏ అభ్యర్థి ఏ పార్టీ తరపున పోటీ చేశారనే దానిపై ఎన్నికల కమిషన్ వద్ద స్పష్టమైన రికార్డు ఉంటుందని నారాయణ తెలిపారు. ఎన్నికైన తర్వాత పార్టీ మారి ప్రజల తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తే, ఫిరాయింపు నిర్ధారణైన వెంటనే సదరు వ్యక్తి పదవి రద్దయ్యే విధంగా చట్టాన్ని ఎందుకు మార్చకూడదని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల ప్రస్తుత దుస్థితికి గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పు చేసి ఉంటే, ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ఆ లోపాలను సరిచేసే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజల తీర్పును, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేలా జరిగే పార్టీ ఫిరాయింపులను అడ్డుకునేందుకు కేంద్రం తక్షణం చట్టపరమైన సంస్కరణలు చేపట్టాలని నారాయణ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఫిరాయింపులను సమర్థించే రాజకీయ నాయకులను చరిత్ర క్షమిస్తుందా అని ఆయన ప్రశ్నించారు.

## ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు



**ముద్ర, హైదరాబాద్:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఖైరతాబాద్ సహ ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు జలమండలి ఆధ్వర్యంలో భక్తులకు తాగు నీటిని అందిస్తున్నారు.

## కారు డోర్ లాక్... ఊపిరాడక చిన్నారి మృతి




**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం :** కారులో ఊపిరాడక చిన్నారి మృత్యువాత పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోబానగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వినోబానగర్ సర్పంచి గంగావత్ నవీన్‌కు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమార్తె తన్విశ్రీ (4) ఇంటి వద్ద ఆడుకుంటూ కారు ఎక్కింది. అనంతరం డోర్ వేయడంతో లాక్ పడింది. కుటుంబ సభ్యులు చిన్నారి కనిపించడం లేదని సమీపంలో గాలించారు. దాదాపు 2 గంటల తర్వాత కారులో చూడగా.. ముందు భాగంలోనే రెండు సీట్ల మధ్యలో పడిపోయి ఉంది. కారు అద్దాలు పగలగొట్టి బాలికను బయటకు తీశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిందని భావించి చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధరించారు. ఉదయం ముద్దు ముద్దు మాటలతో తల్లిదండ్రులను మురిపించిన చిన్నారిని విగత జీవిగా చూడాల్సిన రావడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## అనారోగ్యంతో తాడికల్ గ్రామ సర్పంచి మృతి



**ముద్ర, కరీంనగర్ :** మండలంలోని తాడికల్ గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్న దుర్గపు సుజాత (46) అనారోగ్యంతో మృతి చెందారు. సుజాత గత కొంతకాలంగా అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందారు. సుజాత మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. సర్పంచి మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, సింగిల్‌విండో ఛైర్మన్లు బసవయ్య, మహేష్, సంపత్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామాల సర్పంచులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలికి భర్త తిరుపతి, కొడుకు, కుమార్తె ఉన్నారు.

# బీసీల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం





**ముద్ర, హైదరాబాద్, :** 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించినప్పుడే వారికి జనాభా ప్రాతిపదికన న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించగలమని అన్నారు. బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో నిర్వహించిన జాతీయ ఓబీసీ సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, వివిధ రాష్ట్రాల ఓబీసీ సంఘాల నేతలు, మేధావులు హాజరయ్యారు.

తెలంగాణలో కాంగ్రెస్ హామీ మేరకు కులగణన పూర్తి చేసి, శాసనసభ తీర్మానం, గవర్నర్ ఆమోదం అనంతరం కేంద్రానికి నివేదిక పంపినట్లు పొన్నం తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ఖచ్చితమైన ఎంపిరికల్ డేటా అవసరమని పేర్కొన్నారు. బీసీల జనాభాను లెక్కించకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తామని ప్రశ్నించారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, అయితే బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరిగే విషయంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితిపై కేంద్రం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కులగణన కేవలం జనాభా లెక్కలు కాదని, సామాజిక న్యాయానికి పునాది అని చెప్పారు.

బీసీల హక్కుల కోసం అన్ని రాష్ట్రాలు, నాయకులు ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా పోరాడాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణలో కులగణన పూర్తి చేసి దేశానికి మార్గం చూపించామని, కేంద్రం 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్ చేర్చి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కోరారు.

# ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు

**గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి**
**ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి**
**అభివృద్ధి ఆగకూడదు... పర్యావరణానికి గాయం చేయకూడదు**
**-బెంగళూరులో ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**
**కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ది ఎర్త్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**



**ముద్ర, బెంగళూరు :** భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణతో అభివృద్ధి సాగాలని ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో నిర్మించిన 'ది ఎర్త్ సెంటర్'ను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు.

ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ నిర్మించిన ఈ భవనంలో సుస్థిర నిర్మాణం, రీసైకిల్ పదార్థాల వినియోగం, నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణహిత నిర్మాణాల వైపు అడుగులు వేయాల్సిన సమయం వచ్చిందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ వైపు మారాలి అని సూచించారు.

భవనాల్లో నెట్ జీరో విధానాన్ని అవలంబించడంతో పాటు సోలార్ విద్యుత్, నీటి పునర్వినియోగం, వ్యర్థాలను కంపోస్టుగా మార్చడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లే పట్టణాభివృద్ధిలోనూ ప్రకృతికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ విద్యుత్ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. అమరావతిని ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో భవిష్యత్ తరాలకు అనువైన పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

## గణపతి యాగంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు



**ముద్ర, మంథని :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని రావుల చెరువు కట్ట హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛా రణల మధ్య నిర్వహించిన గణపతి యాగం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంథని నియోజ కవర్గ ప్రజలందరిపై విఘ్నేశ్వరుని ఆశీస్సు లు ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. సింగ రేణి భూముల్లో నివాస ముంటున్న విశ్రాంత కార్మికులు, ప్రజలకు శాశ్వత పట్టాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయిం చిందని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

## రెండు ఏటీఎంలలో రూ.16 లక్షల చోరీ

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ నగరానికి సమీపంలోని రెండు చోట్ల ఆదివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. ఎస్‌బీఐకి చెందిన ఏటీఎంలను ధ్వంసం చేసి దాదాపు రూ.16 లక్షలు చోరీ చేశారు. రెండు ఏటీఎం కేంద్రాలు రాజీవ్ రహదారిపైనే ఉండటం గమనార్హం. సీసీ కెమెరాలకు నలుపు రంగు స్ప్రే కొట్టి, గ్యాస్ కట్టర్‌లతో యంత్రాలను ధ్వంసం చేసి డబ్బు దోచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున 2.40 నుంచి 3 గంటల మధ్య రాజీవ్ రహదారిపై తిమ్మాపూర్ స్టేజీ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు దుండగులు చేరుకున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన అనంతరం ఏటీఎంలోని నాలుగు ట్రేలలో ఉంచిన రూ.7,13,400 నగదు దోచుకున్నారు. అక్కడి నుంచి సుమారు 16 కిలోమీటర్ల దూరంలోని కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడు స్టేజీ వద్ద ఉన్న మరో ఏటీఎం వద్దకు 3.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. ఏటీఎం కింది భాగాన్ని అత్యాధునిక గ్యాస్ కట్టర్ల సాయంతో తొలగించారు. అందులోని సుమారు రూ.8,55,000 నగదు అపహరించారు. ఒక్కో ఏటీఎం వద్ద కేవలం ఏడు నిమిషాల్లోనే చోరీ పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. దుర్శేడు ఏటీఎం వద్ద దొంగలు ప్రయాణించిన ఎంహెచ్ 03 ఈబీ 4258 నంబరు స్కార్పియో వాహనం సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. మొత్తం ముగ్గురు దుండగులు చోరీకి పాల్పడినట్లుగా భావిస్తున్నారు. ఇందులో ఓ వ్యక్తి, ముఖానికి మాస్కు ధరించి మహిళ వేషధారణలో ఉన్నాడు. తమ కదలికలు తెలియకుండా ఏటీఎం వెలుపల, లోపల ఉన్న సీసీ కెమెరాలకు నలుపు రంగు స్ప్రే కొట్టడం అందులో నిక్షిప్తమైంది. రెండు చోట్ల చోరీల తీరును గమనిస్తే పక్కా ప్రణాళికతో రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది.

ఇది అనుభవం ఉన్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనిగా పోలీసులు అనుమానిస్తున్నారు. చోరీ అనంతరం దుండగులు పెద్దపల్లి వైపు పరారయ్యారు. దుర్శేడు ఏటీఎం వద్ద దొంగలు చోరీ చేస్తున్నప్పుడు తెల్లవారుజామున 3.40 గంటలకు ఢిల్లీలోని ఏటీఎం నియంత్రణ ప్రధాన కార్యాలయానికి సమాచారం వెళ్లింది. అక్కడి నుంచి వచ్చిన సూచనల మేరకు బ్యాంకు అధికారులు 4 గంటలకు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా 10 నిమిషాల్లోనే ఏటీఎం వద్దకు చేరుకున్నారు. తిమ్మాపూర్ ఏటీఎం వద్ద చోరీ చేస్తున్నప్పుడు నియంత్రణ ప్రధాన కార్యాలయానికి సమాచారం వెళ్లకపోగా 5.30 సమయంలో ఉదయపు నడకకు వచ్చిన కొంతమంది ఏటీఎం ధ్వంసం కావడం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిమిషాల వ్యవధిలో రెండు ఏటీఎంలలో దొంగలు నగదు చోరీకి పాల్పడటంతో కరీంనగర్ ఉలిక్కిపడింది. పోలీసులు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి, సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో చోటుచేసుకుంటున్న భారీ చోరీ ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా లింగార్చన





**ముద్ర, కరీంనగర్ :** శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్, అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం 'లింగార్చన' కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దక్షిణ కాశీ వేములవాడకు చెందిన రుత్వికుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లింగార్చన నిర్వహించడం గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయమన్నారు. విద్యార్థుల్లో భక్తి, ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ప్రతి ఏడాది అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వివిధ పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో విశిష్టమైనదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మట్టితో లింగాలను తయారు చేసి, ఫలపంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేసి, వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. రుత్వికులు ఉపవాసం పాటిస్తూ సామూహికంగా మంత్రోచ్చారణలు, జపాలు నిర్వహించారు. లింగార్చన వంటి పవిత్ర పూజలతో మనసుకు ప్రశాంతత, ఓర్పు, సహనం, జ్ఞానం, వివేకం పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం ద్వారా శుభఫలాలు కలగడంతో పాటు జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించే ఆత్మవిశ్వాసం కలుగుతుందని తెలిపారు. భక్తులు తమ శక్తి మేరకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వరిపిండితో తయారు చేసిన జ్యోతులను వెలిగించి పూజా కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు. వివిధ రకాల పండ్లు, పండ్ల రసాలు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాత్రి మూత్రవిసర్జన వస్తోందా?

కాళ్ల వాపులు ఉంటే జాగ్రత్త
కాళ్లలో వాపులు ఉన్నవారు పగటిపూట కొంతసేపు కాళ్లను పైకి ఎత్తి ఉంచవచ్చు. కంప్రెషన్ సాక్స్ వాడాలనుకుంటే ముందుగా వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది.



## జాబ్ మేళాలో 14 మందికి ఉద్యోగాలు



**ముద్ర, మోత్కూర్:** ఈ నెల19 న సూర్యాపేట జిల్లా కోదాడ లో నిర్వహించిన జాబ్ మేళాలో మోత్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 14 మంది వివిధ రంగాలలో అర్హత సాధించి , నియామక పత్రాలు అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ రవీందర్ తెలిపారు. కళాశాల నుండి 30 మంది విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనగా ఐదు అంచల ఇంటర్వ్యూలలో పాల్గొన్న వారిలో 14 మంది విద్యార్థులు ఆఫర్ లెటర్లు అందుకోవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. ఇలాంటి జాబ్ మేళాలలో విద్యార్థులు పాల్గొనడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థాయిలలో జరిగే ఇంటర్వ్యూలకు ఇది మార్గదర్శకంగా ఉంటుందని అంది వచ్చిన ఏ అవకాశాలను వదులుకోకూ డదని విద్యార్థులకు సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీ



**ముద్ర, మోత్కూర్:** మోత్కూరు మండలం ముషిపట్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచి పైళ్ళ నర్సిరెడ్డి అధ్వర్యంలో ముషిపట్ల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకోన్నారు.నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా బుషిపాక రమేష్ ,ఉపాధ్యక్షులుగా కొల్లూరీ మల్లయ్య, కార్యదర్శిగా మద కాశీం,లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బుషిపాక రమేష్ గారు మాట్లాడుతూ , పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. నా ఎన్నిక సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి తండా సత్తయ్య , ఉప సర్పంచి నోముల అంజయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొల్లు రమేష్, చేవెళ్లి బీరయ్య,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎర్రానీ పల్లి సందీప్ వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

### రాష్ట్ర పోలీస్ కంప్లెంట్స్ అథారిటీ మెంబర్ డా వర్రే వెంకటేశ్వర్లు



**ముద్ర, మోత్కూర్:** గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొ ల్పేందుకు పోలీసులు కృషి చేయాలని రాష్ట్ర పోలీస్ కంప్లెంట్స్ అథారిటీ మెంబర్ డా వర్రే వెంకటేశ్వర్లు అన్నారు.శనివారం రాత్రి ఆయన మండలంలోని సదర్శాపూర్ లో రాష్ట్ర పోలీస్ కంప్లెంట్స్ అథారిటీ మేంబర్ గా తొలిసారి స్వగ్రామానికి వచ్చిన డా వర్రే వెంకటేశ్వర్లు కు స్థానిక యువకులు, మహిళలు,గ్రామస్తులు పెద్దఎత్తున డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికి,శాలువలతో సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మంటపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామా పండుగలు, ఎన్నికల సమయాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అరాచక శక్తులను ముందస్తుగా గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. గ్రామస్థాయిలో శాంతిభ ద్రతలు అదుపులో ఉన్నట్లైతే కక్షలు, తగాదాలకు చోటు ఉండదన్నారు. నిమజ్జనాలను స్నేహపూర్వక వాతావరణ లో జరుపుకోవాలని సూచించారు.

# ఘనంగా గణనాథుని కళ్యాణం









**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని ఓంకార్ ఆశ్రమం వద్ద నెలకొల్పిన వినాయక మండపం వద్ద ఆదివారం గణనాథుని కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కళ్యాణంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు వార్డ్ కౌన్సిలర్ గుర్రాల సంతోష శ్రీనివాస్, గుర్రాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, నాయకులు హీరకర్ రమేష్, ఓంకార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 20 :** నగరంలోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం వడ్డించారు. విఘ్నేశ్వరుని కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారో గ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, సోదరభావంతో జరుపుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.జె.సి కృష్ణ, పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్, బత్తుల మురళి తదితర నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### శ్రీనివాస్ నగర్ 17వ డివిజన్‌లో..

శ్రీ బాల గణేష్ ఉత్సవ కమిటీ రెండవ వార్షికోత్సవం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమా న్ని ఏసీపీ రమణమూర్తి, త్రీ టౌన్ సీఐ మోహన్ రావు, కార్పొరేటర్ దొడ్డ నగేష్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించా రు. అన్ని దానాల కంటే అన్నదానం మిక్కిలి గొప్పదని పేర్కొన్నారు. భక్తులందరిపై గణపయ్య ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### అన్నదానం

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మునిసిపల్ కేంద్రంలోని పోతాయిగడ్డ పాత పెట్రోల్ బంక్ వద్ద నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కమిటి సభ్యుడు ఆకుల పరు శరాములు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహారెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు కౌన్సిలర్ ఘనగాని శైలజ నరసింహ, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు ముప్పు మల్లారెడ్డి, మజ్జిగ మధుసూదన్ రెడ్డి,తిరుమల్ రెడ్డి,వెంకట్ రెడ్డి,తమ్మినేని శ్రీని వాసరావు,బుడ్డి వెంకన్న, భాస్కర్ రెడ్డి,బద్దం నాగార్జున రెడ్డి, సుదగాని యాదగిరి గౌడ్, బోటిక నాగరాజు, ఎండి అబ్బాస్,ఎండి చోటు,రియాజ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## నిమజ్జనానికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

### ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్ రావు




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చెయ్యాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అధికా రులను ఆదేశించారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని భువనగిరి చెరువును ఆయన పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆయన అధికారులను అడిగి తెలుసు కున్నారు.నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలు, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచే యాలని సూచించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ వైష్ణవి భర్త హత్య కేసులో కీలక పరిణామం

### -మరో నలుగురి పాత్రపై దర్యాప్తు..!



**ముద్ర, నిజామాబాద్ :**హరిబాబు హత్యకేసు నిందితుడు సంతోష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు సంతోష్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు నిజామాబాద్ సీపీ సాయి చైతన్య వివరాలను వెల్లడించారు. వైష్ణవి హత్యకు ప్రతీకారంగానే హరిబాబును సంతోష్ హత్య చేసినట్లు తెలిపారు. “ఈ నెల 17న నిజామాబాద్ లోని ఆర్ఆర్ చౌరస్తా వద్ద హత్య జరిగింది. తల్లి, బంధువుల సహకారంతో హరిబాబును సంతోష్ హత్య చేశాడు. హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, రెండు కర్రలు, కారును స్వాధీనం చేసుకున్నాం. హత్యలో మిగతా నలుగురి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. సంతోష్‌తో పాటు అతడి తల్లి గంధం రాణి, పెద్దమ్మ కుమారులు చరణ్, రంజిత్ నేరాన్ని ప్రోత్సహించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.” అని వివరించారు. అయితే.. ఈ కేసులో మరిన్ని కీలక విషయాలను సీపీ వివరించారు. హరిబాబును హత్య చేసిన అనంతరం సంతోష్ ఆంధ్రాకు పారిపోయేందుకు ప్రయత్నం చేసినట్లు చెప్పారు. అతడిని ట్రేస్ చేసి నిజామాబాద్ బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. అయితే బెయిల్‌పై బయటకి వచ్చిన హరిబాబు నిజామాబాద్‌లో ఉంటున్నట్లు తెలుసుకున్న నిందితులు పక్కా ప్లాన్‌తో మర్డర్ చేశారని తెలిపారు.అసలు ఏం జరిగింది?జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన హరిబాబు.. తన భార్య వైష్ణవి (19)ని ప్రేమవివాహం చేసుకున్నాడు. కానీ.. మార్చి 17న ఆమె 4 నెలల గర్భిణిగా ఉన్నప్పుడు గొంతు నులిమి, కత్తితో పొడిచి చంపాడు. ఈ కేసులో రెండ్రోజుల తర్వాత అరెస్టయి, ఆగస్టు 15న బెయిల్‌పై విడుదలైన హరిబాబు ప్రాణభయంతో అనంతపురంలో గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో పనిచే స్తున్నాడు. బెయిల్‌పై బయటకొచ్చిన అతని తల్లి లక్ష్మి నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్ కాలనీలో అద్దెకుంటూ రాజరాజేంద్ర చౌరస్తా వద్ద మొక్కజొన్నలు విక్రయిస్తోంది. తల్లిని చూడటానికి నిజామాబాద్ వచ్చిన హరిబాబు, గురువారం (సెప్టెంబర్ 17న) సాయంత్రం పానీపూరి బండి వద్ద నీళ్లు తాగుతుండగా వైష్ణవి సోదరుడు సంతోష్ కారులో వచ్చి కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. కేవలం 10 సెకన్ల వ్యవధిలోనే తల, మెడ, నడుము భాగాల్లో 9 సార్లు కత్తితో దారుణంగా నరకడంతో హరిబాబు తీవ్ర రక్తస్రావమై తల్లి కళ్లముందే అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ భయానక హత్య దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డై తీవ్ర వైరల్‌గా మారాయి. కళ్లెదుటే కొడుకును నరికి చంపడంతో తల్లి లక్ష్మి తీవ్ర షాక్‌లోకి వెళ్లి పోవడమే కాకుండా ప్రాణభయంతో వణికి పోతోంది. మార్చి 17న భర్త చేతిలో వైష్ణవి దారుణ హత్యకు గురైతే, సరిగ్గా ఆరు నెలల తర్వాత సెప్టెంబర్ 17న వైష్ణవి సోదరుడి చేతిలోనే హరిబాబు హత్యకు గురికావడం గమనార్హం.

## ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

### లేబర్ కోడ్స్ రద్దు కోసం పోరాడుదాం
### డిసెంబర్ 1, 2, 3 ఢిల్లీ ఆక్కుపై కార్య క్రమంలో భాగస్వామ్యం అవుదాం
### :సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్ రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, లేబర్ కోడ్స్ రద్దు కోసం పోరాడుదామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్ రావు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్ లో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రభుత్వ ఉద్యోగుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్తు సంస్కరణలు తెచ్చి విద్యుత్ సంస్థను ముక్కలు, ముక్కలుగా చేసి ప్రధాని మోడీకి ఆప్తమి త్రులైన ఆదాని, అంబానీలకు అప్పగించనున్నారని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో మూడో డిస్కం, స్మార్ట్ మీటర్ల చర్చ జరుగుతుందని అన్నారు. వినియోగ దారుల పైన విపరీతమైన చార్జీలు పెరగనున్నాయన్నారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని, వ్యవసాయానికి ఇచ్చే ఉచిత కరెంటు ఉండబోదని అన్నారు. ఫలితంగా రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొని వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి రాక ఆత్మహత్యల పరంపర కొనసాగనున్నదని అన్నారు. సంస్థను ప్రైవేటు వాళ్లకు అప్పజెప్పకుండా ఉండేందుకు ఉద్యోగులు, రైతులు, ప్రజలు సంఘటితంగా పోరాడి తిప్పి కొట్టాలన్నారు. రైల్వే రంగంలో కూడా ప్రైవేటీకరణ చేసే దిశగా చర్యలు చేపట్టారని అన్నారు. రైల్వే స్టేషన్లు, రైల్వే లైన్లు అంబానీ, ఆదానీలకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని అన్నారు. డిసెంబర్ 1, 2, 3 తేదీలలో సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపు మేరకు ఢిల్లీ ఆక్కుపై కార్యక్రమం జరగనున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే, ఎల్ఐసి, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, మాయ కృష్ణ, నాయకులు బొల్లెపల్లి శ్రీనివాస్, ఏదునూరి మల్లేశం, యాదప్ప, ఇంజ మహేష్, బొల్లెపల్లి వెంకటస్వామి, ఆర్ నరసయ్య, బొల్లెపల్లి వెంకటేష్, పాష పాల్గొన్నారు.

## సూర్యాపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

### సజీవ దహనమైన ఖమ్మం న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్



**ముద్ర ప్రతినిధి, సెప్టెంబరు, 20 :** సూర్యాపేట – ఖమ్మం 365 జాతీయ రహదారిపై పిల్లల మర్రి సమీపంలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వోల్వో కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి బయటకు రాలేక మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. మృతుడిని ఖమ్మంలోని ప్రముఖ మమత ఆస్పత్రికి చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ కాసకుర్తి జగదీష్‌గా గుర్తించారు.పువ్వాడ దిగ్భ్రాంతి...ఈ విషాద వార్త తెలుసుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైద్యుడిగా ఎంతో మందికి సేవలందించిన డాక్టర్ జగదీష్ అకాల మరణం వైద్య రంగానికి, ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని సానుభూతిని తెలిపారు.వద్దిరాజు సంతాపం దారుణ ఘటనలో డాక్టర్ జగదీష్ చనిపోవడం వైద్య రంగానికి తీరని లోటని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. జగదీష్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ఎంపీ ప్రగాఢ సానుభూతి తెలిపారు.డా. జగదీష్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు.

## చిన్ననాటి మిత్రుల ఆపన్నహస్తం



**ముద్ర, దేవరకొండ:** చింతకుంట్ల గ్రామానికి చెందిన కుంచం గిరి, సన్నాఫ్ వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రులు మానవత్వంతో స్పందించారు. గిరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న మిత్రులంతా కలిసి ఆయనకు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.ఈ క్రమంలో చిన్ననాటి మిత్రులందరూ కలిసి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న గిరికి వైద్య ఖర్చుల విషయంలో కొంతమేరకు సహాయపడాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సాయం చేసినట్లు మిత్రులు తెలిపారు. చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన తమ మిత్రుడు అనారోగ్యానికి గురైన సమయంలో అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. కుంచం గిరి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అవసరమైన సమయంలో తోటి మిత్రులకు అండగా నిలవడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని తెలిపారు. గిరి కుటుంబానికి ధైర్యం కల్పిస్తూ, భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.చిన్ననాటి మిత్రులు కలిసి రూ.25 వేల ఆర్థిక సాయం అందించడం పట్ల కుంచం గిరి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో మిత్రులు చూపిన ఆప్యాయత, మానవత్వం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్, అరవింద్, సంతోష్, మణికంఠ, సామ్యూల్, బేబీ, మహేశ్, జగన్, సాయికృష్ణ, మహేందర్, నికిత, వినీష, గిరిబాబు, వెంకటేష్, ప్రకాష్, శివాని, మహేశ్ తదితర చిన్ననాటి మిత్రులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



**ముద్ర, మోత్కూర్:**మోత్కూర్ లో గతంలో వివిధ అనారోగ్య కారణాల వల్ల ఆసుపత్రిలో చికిత్స పొంది అట్టి ఆస్పత్రి బిల్లులతో ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి ని సంప్రదించగా ఆయన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వద్ద అప్లై చేయించగా వచ్చిన చెక్కులను ఆదివారం 10 మంది లబ్ధిదారులకు గుంటి అనూష–ఉపేందర్ కనుక ఇరువై ఆరు వేల రూపాయలు ,ధనలక్ష్మి నాగరాజు ఇరువై ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు,కనుకు ధనలక్ష్మి నాగరాజు ఇరువై వేల రూపాయలు,షేక్ రాఫీత పద్దెనిమిది వేల రూపాయలు, దేవర మధు తొంబై వేల రూపాయలు,జిట్టా పద్మ ఇరువై వేల రూపాయలు,ఎల్లంల మల్లమ్మ ఇరువై వేల రూపాయలు,పగిడిపల్లి రాములు ముప్పై ఆరు వేల రూపాయలు,నర్రె శ్రీశైలం కు ముప్పై వేల రూపాలు, గిర కత్తుల శోభన్ బాబు కు పదివేల రూపాయలు మొత్తం మూడు లెక్షల ఎనభై ఎనిమిది వేల ఐదు వందలరూపాయల చెక్కులను లబ్ధిదారులకు పైళ్ల సోమిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మోత్కూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్,బిసు శ్రీకాంత్ గౌడ్,మెంట రమణ నాగేష్,కురుమీళ్ళ ప్రమీల రాములు, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు నిమ్మల శ్రీను,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అవిశెట్టి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 21.09.2026
www.mudranews.in | @mudranews



### రాత్రి మూత్రవిసర్జన తగ్గేందుకు



పడుకునే ముందు నీటిని తగ్గించండి** నిద్రకు 2–3 గంటల ముందు నుంచి నీరు, ఇతర ద్రవాలను ఎక్కువగా తీసుకోవడం తగ్గించండి. అయితే పగటిపూట మాత్రం శరీరానికి అవసరమైనంత నీరు తీసుకోవాలి.

# విఘ్నేశ్వరునికి విశేష పూజలు





### విఘ్నేశ్వరుడి 90వ వార్షికోత్సవం

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం (శిశుమందిర్) వద్ద వినాయకుడి 90వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ పట్టణంలో నిజాం కాలంలో వినాయకుడి ఉత్సవాలు నిర్వహించడం విశేషం. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాగి అశోక్, లింగారెడ్డితోపాటు సభ్యులు జంగిటి బాల్‌రాజ్ యాదవ్, కామాటి రూపేష్, గోపి, మనోజ్, లక్ష్మణ్,సాయి, తేజ,దుర్గ,పూల శ్రీకాంత్, విలాస్, శివుడు, అఖిల్, భవానీ శంకర్, చరణ్, అమిత్,ప్రశాంత్, రాజ్ కుమార్, సాయి, రాము, బట్టి శ్రీధర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విఘ్నేశ్వరుడి సేవలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఆదిదేవుడు విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం మెదక్ పట్టణంలోని శాంతి నగర్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి, నాయకులు జీవన్ రావు, పట్టణ పార్టీ కో – కన్వీనర్ గడ్డమీది కృష్ణగౌడ్, కౌన్సిలర్ దీపక్ కుమార్, శాంతి నగర్ గణేష్ మండలి సభ్యులు మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. హవేలిఘనపూర్ మండల కేంద్రంలోని



భగత్‌సింగ్ గణేష్ మండపంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ మ్యాకల సాయిలు, ఉపసర్పంచ్ వడ్ల రాజు, మామిళ్ళ ఆంజనేయులు, సాప సాయిలు, గణేష్ సభ్యులు, సత్యం గౌడ్, దొమ్మాట రవి, బాయికాడి పోచందర్, మన్నె శంకర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. మెదక్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు తారకరామ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఇనాయత్ తండ్రి ఖలీల్, కిష్టయ్య అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి పరామర్శించారు.

# విశ్వాసం, సేవ, సామరస్యానికి ప్రతీకగా సెంట్రల్ గురుద్వారా

### సాహిబ్ గౌలిగూడ శతాబ్ది వేడుకలు

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 20:** విశ్వాసం, సేవ, సామాజిక సామరస్యానికి శతాబ్దకాలంగా ప్రతీకగా నిలిచిన చారిత్రక సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ శతాబ్ది వేడుకలు ఆదివారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ చారిత్రక వేడుకలకు వేలాది మంది సిక్కు భక్తులతో పాటు వివిధ వర్గాలు, మతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.1926లో స్థాపించబడిన సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ హైదరాబాద్ నగర పరిణామానికి తరతరాలుగా సాక్షిగా నిలిచింది. కాలాను గుణంగా ఎన్నో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ సమానత్వం, సోదరభావం, కరుణ, సేవా (నిస్వార్థ సేవ) వంటి తన మౌలిక సందేశాన్ని కొనసాగిస్తూ వచ్చింది. అందువల్ల గురుద్వారా శతాబ్ది కేవలం 100 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకునే సందర్భం మాత్రమే కాకుండా, తెలంగాణ సామాజిక, సాంస్కృతిక జీవితంలో సిక్కు సమాజం అందిస్తున్న నిరంతర సేవలు, సహకారాన్ని చాటిచెప్పే వేడుకగా నిలిచింది.ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ ప్రబంధక కమిటీ, తెలంగాణలోని వివిధ సిక్కు గురుద్వారాల సహకారంతో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'విశాల్ దీవాన్' (భారీ మతపరమైన సమ్మేళనం) నిర్వహించింది. సెప్టెంబర్ 20న జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది సిక్కు భక్తులతో పాటు ఇతర మతాలకు చెందిన ప్రజలు పాల్గొని సిక్కుల పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ్ సాహిబ్ జీకి ప్రార్థనలు సమర్పించారు.ఈ శతాబ్ది వేడుకలకు పలువురు ప్రముఖ సిక్కు ఆధ్యాత్మిక, సామాజిక నాయకులు హాజరయ్యారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఉన్న తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ అబ్చల్‌నగర్ సాహిబ్ జథేదార్ (ప్రధాన పూజారి) సింగ్ సాహిబ్ సంత్ బాబా కుల్వంత్ సింగ్ జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిక్కు మతంలోని ఐదు అత్యున్నత తఖ్త్‌లలో (ఆధ్యాత్మిక, ప్రాధికారిక పీఠాల్లో) తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ సాహిబ్ ఒకటి.నాందేడ్‌లోని గురుద్వారా లంగర్ సాహిబ్‌కు అనుబంధంగా ఉన్న ప్రముఖ



ఆధ్యాత్మిక, సామాజిక నాయకుడు సంత్ బాబా బల్విందర్ సింగ్ జీ (హజూర్ సాహిబ్ వాలే), ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ (DSGMC) అధ్యక్షుడు హర్మీత్ సింగ్ కల్కా కూడా శతాబ్ది వేడుకల్లో పాల్గొన్నారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ రాగీ జథాలు, కీర్తనకారులు, కథా వాచకులు ఆలపించిన గుర్బాణీ కీర్తనలు, నిర్వహించిన కథా ప్రవచనాలతో కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఢిల్లీకి చెందిన భాయ్ జగ్జిత్ సింగ్ బబీహా, లూధియానాకు చెందిన భాయ్ బల్‌ప్రీత్ సింగ్, భాయ్ జగ్‌ప్రీత్ సింగ్ ఖన్నేవాలే, భాయ్ రవీందర్ సింగ్ తదితరులు శబద్ కీర్తనలు ఆలపించి సిక్కు గురువుల బోధనలను వివరించారు.వారి సందేశం గురుద్వారా గోడలను దాటి సమాజంలోని అన్ని వర్గాలకు చేరింది. జాతీయ సమైక్యత, శాంతి, సమానత్వం, సోదరభావం, మత సామరస్యాన్ని వక్తలు ప్రధానంగా ప్రస్తావించారు. శాంతియుత సహజీవనం, మానవ సేవను ప్రబోధించిన సిక్కు గురువుల బోధనలను అనుసరించాలని భక్తులకు పిలుపునిచ్చారు. "చారిత్రక శతాబ్ది వేడుకలు విశ్వాసం, సేవ, ఐక్యతకు ప్రతీక. ఇవి మొత్తం సమాజాన్ని ఒకచోటికి తీసుకువచ్చాయి" అని సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ ప్రబంధక కమిటీ అధ్యక్షుడు ఎస్. త్రిలోక్ సింగ్ అన్నారు.శతాబ్ది వేడుకలు గురుద్వారా మతపరమైన సేవలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజానికి అందిస్తున్న విస్తృత సేవలను కూడా గుర్తుచేశాయి. తరతరాలుగా గురుద్వారా ప్రార్థనా స్థలంగా, సామాజిక అనుబంధానికి వేదికగా, నిస్వార్థ సేవా కేంద్రంగా కొనసాగుతోంది. గురుద్వారా నిర్వహిస్తున్న సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సిక్కు సమాజానికి, హైదరాబాద్ విస్తృత సామాజిక వర్గాలకు మధ్య బంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.గురుద్వారా రెండో శతాబ్దంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో, తన గొప్ప ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు యువతరాన్ని సేవ, సమానత్వం, కరుణ వంటి విలువలను కొనసాగించేలా ప్రేరేపించాలనే సందేశాన్ని శతాబ్ది వేడుకలు అందించాయి.హైదరాబాద్ సిక్కు సమాజానికి సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ ప్రస్థానం ఒక నిరంతర వారసత్వానికి ప్రతీక. తమ సంప్రదాయాలను కాపాడుకుంటూనే హైదరాబాద్ బహుళత్వ స్వభావంలో సిక్కు సమాజం అంతర్భాగంగా ఎలా ఎదిగిందో గురుద్వారా చరిత్ర ప్రతిబింబిస్తుంది.చారిత్రక గురుద్వారా రెండో శతాబ్దంలోకి అడుగుపెడుతున్న వేళ, శతాబ్ది వేడుకలు గతానికి ఘన నివాళిగా, భవిష్యత్తుకు వారధిగా నిలిచాయి. గౌలిగూడ నుంచి వెలువడిన సందేశం నేటికీ అంతే స్ఫూర్తిదాయకంగా ఉంది——విశ్వాసానికి నిజమైన అర్థం సేవలోనే ఉంది; సమాజం ఐక్యంగా, సామరస్యంతో ముందుకు సాగినప్పుడే అది మరింత బలోపేతమవుతుంది అని త్రిలోక్ సింగ్ అన్నారు.సమ్మేళనం ముగింపులో నిర్వహించిన సంప్రదాయ 'గురు–కా–లంగర్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులకు ఉచితంగా అందించే ఈ సామూహిక వంటశాలలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఒకే వరుసలో కూర్చొని ఒకే భోజనాన్ని స్వీకరించారు. సామాజిక, మతపరమైన భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సమానమేనని, తోటి మానవులకు సేవ చేయడం సామాజిక, మతపరమైన హద్దులను అధిగమిస్తుందనే సిక్కు తత్వంలోని గొప్ప సందేశాన్ని లంగర్ ప్రతిబింబించింది.



## వేల్పుగొండలో హెరిటేజ్ వాక్ చారిత్రక, వారసత్వ సంపదపై అవగాహన



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో ఆదివారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. "మెతుకుసీమ వైభవం" ఆధ్వర్యంలో బుర్ర సంతోష్ పర్యవేక్షించారు. సర్పంచ్ నీరుడి దాసు, ఉప సర్పంచ్ సుధాకర్, సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షులు కొండల్ రెడ్డి హాజరయ్యారు.వేల్పుగొండలోని శ్రీ తుంబురేశ్వర స్వామి ఆలయ చారిత్రక ప్రాధాన్యత, ఆలయ శిల్పసంపద, ఆదిమానవుల రాతి చిత్రాలు, జైన తీర్థంకరుల శిల్పాలను పరిశీలించారు. ఆయా చారిత్రక ప్రదేశాలు, శిల్పాల ప్రాధాన్యతను బుర్ర సంతోష్ వివరించారు.వేల్పుగొండ ప్రాంతంలో ఉన్న చారిత్రక, పురావస్తు, సాంస్కృతిక సంపదను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే హెరిటేజ్ వాక్ ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఏనుగుల శ్రీనివాస్, రాము, వడ్ల రవితో పాటు పలువురు యువత పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ లో మెదక్ విద్యార్థుల ప్రతిభ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** హైదరాబాద్ లో ఓపెన్ నేషనల్ లెవెల్ అల్ స్టయిల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షీప్ లో మెదక్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీలను వరల్డ్ నాయకీమ్ కరాటే వారు హైదరాబాద్ లోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించినట్లు రెంజుకి షోటోకన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షులు నగేష్ తెలిపారు. పోటీలకు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లలో అనన్య, మేగావార్షిక, సమీన్ గోల్డ్ మేడల్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్లు నవీన్, రాకేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బశాంతి కోసం కలిసి నడిచిన రోటేరియన్లు

### కేబీఆర్ పార్క్ నుంచి జింఖానా క్లబ్ వరకు శాంతి పాదయాత్ర

**ముద్ర, హైదరాబాద్:** ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శాంతి పాదయాత్ర నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ కృషి రాజేంద్రనగర్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కేబీఆర్ పార్క్ ప్రవేశద్వారం వద్ద ప్రారంభమైన పాదయాత్రలో రోటేరియన్లు, సాధారణ వాకర్లు కలిసి సుమారు రెండు కిలోమీటర్లు నడిచారు. శాంతి, సామరస్యం, ఐక్యత ప్రాధాన్యతను చాటుతూ ఈ కార్యక్రమం సాగింది.అనంతరం రోటేరియన్ ఝూన్సీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు శాంతి సందేశంతో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువస్తాయని అన్నారు.హైదరాబాద్ జింఖానా క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు రోటేరియన్ చక్రవర్తి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ అధ్యక్షుడు రోటేరియన్ అజయ్‌కుమార్, ఏజీ రోటేరియన్ బాలకోటిరెడ్డి మాట్లాడారు.మధ్యవర్తి రోటేరియన్ జసింత మాట్లాడుతూ హైకోర్టు ఆమోదం పొందిన మధ్యవర్తిత్వ కేంద్రాన్ని వినియోగించుకుని వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సుదీర్ఘ న్యాయపోరాటాలకు వెళ్లకుండా పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం మధ్యవర్తిత్వం ద్వారా లభిస్తుందని వివరించారు.శాంతి అనేది ప్రతి వ్యక్తి నుంచే ప్రారంభం కావాలని వక్తలు పేర్కొన్నారు. దేశాల మధ్య యుద్ధాలు లేకపోవడమే ప్రపంచ శాంతి కాదని, కుటుంబాలు, సమాజంలో ప్రేమ, గౌరవం, ఐక్యతతో జీవించడమే నిజమైన శాంతి అని అన్నారు. అనంతరం స్నేహపూర్వక అల్పాహార విందుతో కార్యక్రమం ముగిసింది. "శాంతి కోసం నడుద్దాం.. శాంతితో జీవిద్దాం.. శాంతిని వ్యాప్తి చేద్దాం" అనే సందేశాన్ని కార్యక్రమం ద్వారా అందించారు.

## ములుగు జిల్లాలో తీవ్ర విషాదం.. నీటి కుంటలో పడి అక్కాచెల్లెళ్ల మృతి

ముద్ర, ములుగు: సరదాగా తండ్రితో పాటు పొలానికి వెళ్లిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ప్రాణాలు కోల్పోయారు. ములుగు మండలం కాసిందేపేట గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు మహమ్మద్ అంజద్ పాషా తన కుటుంబ సభ్యులతో కలిసి పత్తి చేనులో పురుగుల మందు కొట్టేందుకు తండ్రితో పాటు ఆయన ఇద్దరు కుమార్తెలు సమ్యాన్ (19), ఆసియా (10) కూడా పొలం వద్దకు వెళ్లారు. తండ్రి పొలంలో పనిచేసుకుంటుండగా, సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిల్లలిద్దరూ సరదాగా సమీపంలో పంట సాగు నీటి నిల్వ కోసం తవ్విన గుంట (ఫాం పాండ్) వద్దకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత పిల్లలు ఎక్కడా కనిపించకపోవడంతో కంగారుపడిన తల్లిదండ్రులు పొలం చుట్టుపక్కల వెతికారు. సందేహం వచ్చి నీటిగుంట వద్దకు వెళ్లి పరిశీలించగా, పిల్లలిద్దరూ నీటిలో మునిగిపోయి నట్లు గుర్తించారు. వెంటనే వారిని బయటకు తీసి కాపాడుకునేందుకు ప్రయత్నించి నప్పటికీ, లోతు ఎక్కువ కావడంతో అప్పటికే ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోయారు.

## వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానలో అమానుష ఘటన మార్చురీలో శవాన్ని పీక్కతిన్న ఎలుకలు

**ముద్ర, వరంగల్:**
జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానలో అమానుష ఘటన చోటు చేసుకుంది. గౌరె వీరయ్య అనే వ్యక్తి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పోలీసులు మార్చురీకి తరలించారు. అయితే ఉదయం మృతదేహం కంటి భాగంలో ఎలుకలు కొరికిన ఆనవాళ్లను చూసి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రీజర్ లాంటి కనీస సౌకర్యాలు కూడా ప్రభుత్వ దవాఖానలో లేవని మండిపడుతున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555